


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 327, పేజీలు - 08
ఆదివారం, మే 17, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు
2లో..

**- జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన**



## భారత్‌లో తొలిసారి పట్టుబడిన 'జీహాదీ' డ్రగ్
2లో..





## ప్రక్షాళనకు
# రేవంత్ రెడ్డి రెడీ.?

### హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ కోసం వెయిటింగ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.

**మిగిలిన ఎన్నికలు**

తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.

**ప్రస్తుత మంత్రివర్గంలో**

ప్రస్తుత మంత్రివర్గంలో
2లో..

## పార్టీని వీడాలనుకునేవాళ్లు
# వెళ్లిపోవచ్చు


- **టీఎంసీ అభ్యర్థులతో సమావేశమైన మమతా బెనర్జీ**
- **పార్టీలో విబేధాలు చోటుచేసుకున్నట్టు ప్రచారం**
- **నిరంభ్యంతరంగా వెళ్లొచ్చని రెబల్స్‌కు దీదీ స్పష్టం**



కోల్కతా (ప్రశ్న న్యూస్) ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. పార్టీలో ఉండాలనుకునేవాళ్లు ఉండొచ్చని, వీడాలనుకునేవాళ్లు నిరంభ్యంతరంగా వెళ్లొచ్చని దీదీ ఖరాఖండిగా చెప్పినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి. ఓటమి అనంతరం టీఎంసీలో అంతర్గత విభేదాలు చోటుచేసుకున్నట్టు ఊహాగానాలు వెలువడుతోన్న తరుణంలో మమతా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాదు, అసమ్మతి నేతలకు దీదీ క్లారిటీ ఇచ్చినట్టయ్యింది.
ఎన్నికల్లో పోటీ చేసిన టీఎంసీ అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమత బెనర్జీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆమె మేనల్లుడు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ మళ్లీ పార్టీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచే శారు. ఈ క్రమంలోనే 'పార్టీ నుంచి వెళ్లిపోయేవారిని వెళ్లనివ్వండి. పార్టీని మళ్లీ కొత్తగా నిర్మిస్తాను ఉన్నవాళ్లే దెబ్బతిన్న పార్టీ ఆఫీసులను పునర్నిర్మించండి. వాటికి రంగులు వేయండి అవసరమైతే నేను కూడా రంగులు వేస్తారు ఎప్పటికీ టీఎంసీ తల వంచదు ప్రజల తీర్పును వారు చోరీచేశారు' అని టీఎంసీ అధినేత్రి అన్నట్టు వర్గాలు వెల్లడించాయి.
అనంతరం టీఎంసీ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్)లో ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలను పోస్ట్ చేసింది. 'టీఎంసీ ఒక కుటుంబంలా ఐక్యంగా నిలబడుతుంది ప్రజల తీర్పును దోచుకున్న వాళ్ల ముందు మేం ఎప్పటికీ తలవంచం ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది' అని పేర్కొంది. పార్టీకి క్లిష్ట పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో
2లో..

# పిల్లల్ని కంటే 30 వేలు, 40 వేలు

### - తల్లితండ్రులకు చంద్రబాబు బంపర్ ఆఫర్



అమరావతి (ప్రశ్న న్యూస్) 'పేదరికం లేని సమాజం , ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నాను. అందుకే మూడు, నాలుగో సంతానానికి ప్రోత్సాహకం అందించేలా నిర్ణయం తీసుకుంటున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.'మూడో సంతానానికి 30 వేలు, నాలుగో సంతానానికి 40 వేలు ప్రోత్సాహకం ఇస్తాం. అంగన్వాడీలను బలోపేతం చేస్తున్నాం. తల్లికి వందనం కింద రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు. రీ సర్వే ద్వారా భూముల రికార్డులు ప్రక్షాళన చేస్తున్నాం. ఎవరూ ట్యాంపరింగ్ చేసే అవకాశం లేకుండా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టదారు పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నాం. 2027 మార్చి నాటికి రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

**మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దు**

గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటు పడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం
2లో..

## సంపద సృష్టి కాదు..
# సంక్షోభ సృష్టి

### - కాగ్ లెక్కలతో చంద్రబాబు సర్కార్‌పై జగన్ అటాక్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ప్రచురించిన 2025-26 ఆర్థిక సంవత్సర తాత్కాలిక ఖాతాలను విశ్లేషిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్న అభివృద్ధి లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని.. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వైపు కూరుకుపోతోందని ఆయన ఆరోపించారు.

**జీఎస్‌డీపీ గారడీ**

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 10.75% వృద్ధి చెందిందని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోందని, కానీ ప్రభుత్వ పన్ను ఆదాయం మాత్రం 3.22% తగ్గడం విడ్డూరంగా ఉందని జగన్ విమర్శించారు. సాధారణంగా రాష్ట్రం వృద్ధి పథంలో ఉంటే పెట్టుబడులు, వినియోగం పెరిగి పన్ను వసూళ్లు కూడా పెరుగుతాయని, ఇక్కడ పన్ను ఆదాయం తగ్గడం అంటే ఆర్థిక
2లో..

## సోషల్ మీడియాలో ఎక్కువ..
# సొసైటీలో తక్కువ

### - బీజేపీ పార్టీపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ పైన దిశానిర్దేశం చేశారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల
2లో..

## పోలీసుల ఎదుట లొంగిపోయిన
# బండి భగీరథ్

### - న్యాయవాదుల సమక్షంలో అప్పగించిన కుటుంబసభ్యులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. బండి భగీరథ్‌ను ఆయన కుటుంబసభ్యులు న్యాయవాదుల సమక్షంలో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. మైనర్ బాలికపై లైంగిక
2లో..



## ఈసారి ముందుగానే రుతుపవనాలు

### - కానీ 'ఎల్ నినో' గండం!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి
2లో..

## చట్టం ముందు తన బిడ్డయినా,
# సామాన్యుడైనా ఒక్కటే


- **నా కుమారుడ్ని పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్**
- **బండి భగీరథ్ ఏ తప్పు చేయలేదని భగీరథ్ చెబుతున్నాడన్న సంజయ్**
- **బెయిల్ వస్తుందని లాయర్లు చెప్పారన్న కేంద్ర మంత్రి**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తన కుమారుడు బండి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. చట్టంపై ఉన్న గౌరవంతో లాయర్ల ద్వారా బండి భగీరథ్‌ను పోలీసుల విచారణకు అప్పగించినట్లు బండి సంజయ్ కుమార్ తెలిపారు. చట్టం ముందు తన బిడ్డయినా, సామాన్యుడైనా ఒకటేనని, అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని, వాస్తవానికి బాధితుల నుంచి ఫిర్యాదు రాగానే అతనిని పోలీస్ స్టేషన్‌లో అప్పగిద్దామని భావించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ లోపు లాయర్లను సంప్రదించి తమ వద్ద ఉన్న
2లో..



## తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'

### - జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ
2లో..



## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు
# సామాన్యుల పాలిట పిడుగుపాటు

### - ఇది విశ్వాస ఘాతుకం అన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచం అని ఎన్నికలకు ముందు పదేపదే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల్లోనే పెంచడం ప్రజల
2లో..



## డిజిటల్ చెల్లింపుల్లో
# ప్రపంచంలోనే భారత్ టాప్
2లో..



## ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి రెడీ.?

సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.

## పార్టీని వీడాలనుకునేవాళ్లు వెళ్లిపోవచ్చు

మనోధైర్యాన్ని నింపడానికి, ఐక్యతా సందేశాన్ని పంపడానికి బెనర్జీ ఈ సమావేశాన్ని ఉపయోగించుకున్నారని టీఎంసీ అంతర్గత వర్గాలు తెలిపాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తర్వాత కూడా దీదీ ఇటువంటి వ్యాఖ్యలే చేయడం గమనార్హం. చాలామంది పార్టీ మారుతారని తనకు తెలుసన్న మమతా వెళ్లానుకునే వాళ్లను తాను అపాబోనని స్పష్టం చేశారు. పార్టీని వీడేందుకు వాళ్లకు సొంత ప్రయోజనాలు, కారణాలు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ టీఎంసీ 80 సీట్లకే పరిమితమైంది. బీజేపీ 207 స్థానాల్లో విజయం సాధించడంతో వరుసగా పదిహేనేళ్ల పాటు కొనసాగిన టీఎంసీ పాలన ముగిసింది. ఇక, మమతా తన కంచుకోట భవానీపూర్‌లో ఓటమి ఎదుర్కొన్నారు. ఆమెపై బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి 15 వేలకుపైగా ఓట్లతో గెలుపొందారు.

## సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ

ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్‌ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

### తెలంగాణలో బీజేపీ లేనే లేదు

'తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే అని విమర్శించారు. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది అని ధ్వజమెత్తారు. 'తెలంగాణలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం విషయంలో బూత్ లెవెల్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో బీజేపీ ఆటలు సాగకుండా, ఆ పార్టీ అరాచకాలు నడవకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### ఓటర్లను తొలగించకుండా జాగ్రత్త వహించాలి

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రపూరితంగా మన ఓటర్ల ఓట్లను తొలగించకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్త వహించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు నమోదు కాకుండా ఖచ్చితమైన నిఘా ఉంచాలి అని సూచించారు. అర్హులైన ప్రజల ఓటు హక్కును కాపాడటంలో ప్రతి బూత్ స్థాయిలో 'బూత్ లెవెల్ అసిస్టెంట్లు' కీలకంగా వ్యవహరించాలి అని సూచించారు. కార్పొరేటర్ ఆశావాహులు క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్, బీజేపీ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను గట్టిగా ఎండగట్టాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, కంటోన్మెంట్ బోర్డ్ సభ్యులు , సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## చట్టం ముందు తన బిడ్డయినా, సామాన్యుడైనా ఒకటే

ఆధారాలను వారి ముందు ఉంచామని బండి సంజయ్ తెలిపారు. ఆ ఆధారాలను చూసిన లాయర్లు.. కేసు కొట్టేస్తారని, బెయిల్ తప్పకుండా వస్తుందని చెప్పడం వల్లే పోలీసుల ముందుకు రావడంలో కొంత జాప్యం జరిగిందని కేంద్ర మంత్రి వివరించారు. ఈ రోజు కూడా బెయిల్ వస్తుందని లాయర్లు చెబుతున్నప్పటికీ, ఇకపై మరింత ఆలస్యం చేయడం సరికాదనే ఉద్దేశంతోనే తన కుమారుడిని తీసుకొచ్చి న్యాయవాదుల ద్వారా పోలీసుల విచారణకు స్వయంగా అప్పగించినట్లు స్పష్టం చేశారు. సోమవారం నాడు కోర్టు నుంచి కీలక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయ వ్యవస్థపై ఉన్న సంపూర్ణ నమ్మకం, గౌరవంతోనే ముందే విచారణకు పంపించినట్లు బండి సంజయ్ పేర్కొన్నారు. న్యాయస్థానంలో తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## భారత్‌లో తొలిసారి పట్టుబడిన 'జీహాదీ' డ్రగ్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో తొలిసారి భారీ ఎత్తున జీహాదీ డ్రగ్ పట్టుబడింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా వివాదాస్పద సింథటిక్ డ్రగ్ 'క్యాప్టగన్'ను స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం ప్రకటించారు. 'ఆపరేషన్ రేజ్‌పిల్'లో భాగంగా నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ.182 కోట్ల విలువైన 'క్యాప్టగన్' ట్యాబ్లెట్లను గుర్తించినట్టు తెలిపారు. ఢిల్లీలోని నెబ్ సరాయ్ ప్రాంతంలో ఎన్సీబీ మే 11న ఈ ఆపరేషన్ నిర్వహించింది. ఢిల్లీలో 31.5 కిలోల క్యాప్టగన్ టాబ్లెట్లు దొరికాయని, వీటిని చపాతీ కటింగ్ మెషీన్‌లో రహస్యంగా దాచిపెట్టారని అన్నారు. జెడ్డా, సౌదీ అరేబియా గల్ఫ్ దేశాలకు ఈ డ్రగ్స్‌ను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణాతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరియా పౌరుడ్ని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. టూరిస్ట్ వీసాపై 2024 నవంబరు 11న భారత్‌కు వచ్చాడని, జనవరి 1, 2025తో గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉన్నట్టు గుర్తించారు. అతడి ఇచ్చిన సమాచారం ఆధారంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌లో మే 14 సోదాలు నిర్వహించి, మూడు బ్యాగుల్లో దాచిన 196.2 కిలోల టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టినట్టు పేర్కొన్నారు. అత్యంత చౌక ధరకు లభించే 'క్యాప్టగన్'ను 'జిహాదీ డ్రగ్', 'పేదవాడి కొకైన్'గా పిలుస్తారు. పశ్చిమాసియా దేశాలు, యుద్ధ ప్రాంతాల్లో ఈ డ్రగ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. సిరియా అంతర్యుద్ధం సమయంలో ఐసిస్ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున దీనిని ఉపయోగించారు. ఈ డ్రగ్‌ను తీసుకుంటే ఎక్కువ గంటలు నిద్ర లేకుండా ఉండటం, అలసట, భయం లేకపోవడం వంటి ప్రభావాలను కలిగిస్తుంది. అందుకే దీనిని 'జిహాదీ డ్రగ్' అని అంటారు. 1960 దశకంలో దృష్టిలోపం, నార్కోలెప్సీ ఉన్న రోగులకు చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగించేవారు. అయితే, దీనిని ఉపయోగిస్తే ఆ మత్తు అలవాటుగా మారుతుందని చాలా దేశాలు నిషేధించాయి. కానీ ఇది అసలైంది కాదు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో మాత్రమే లభిస్తోంది. ఈ డ్రగ్‌లో రహస్యంగా యాంఫెటమైన్, మెతాంఫెటమైన్ వంటి హానికారక రసాయనాలను కలుపుతున్నారు. ఈ డ్రగ్ తీసుకున్న తర్వాత కొద్దిసేపు ఉత్సాహంగా ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా తీవ్ర మానసిక సమస్యలు, హింసాత్మక ప్రవర్తన వంటి దుష్పరిణామాలను కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈక్వెడార్ నుంచి వచ్చిన ఒక కంటైనర్‌లో దాచి ఉంచిన 349 కిలోగ్రాముల కొకైన్‌ను ముంబయిలో ఇటీవల పట్టుబడిన నేపథ్యంలో తాజా ఘటన ప్రాధాన్యతను సంతరించుకుంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కోసం అంతర్జాతీయ సిండికేట్లు వాణిజ్య సరుకులను, కంటైనర్ల ద్వారా జరిగే వ్యాపార మార్గాలను వినియోగించుకుంటున్నారనడానికి ఇదో ఉదాహరణ. ఈ సిండికేట్‌కు సంబంధించిన సేకరణ మూలాలు, ఆర్థిక మరియు హవాలా సంబంధాలు, లాజిస్టిక్స్ మధ్యవర్తులు, అంతర్జాతీయ స్వీకర్తలు, మరియు విస్తృత అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను గుర్తించడానికి ఎన్‌సిబి ఒక సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగం అనే ప్రపంచ సమస్యకు సామూహిక ప్రతిస్పందనను నిర్ధారించడానికి, నిఘా సమాచార మార్పిడి, మాదకద్రవ్యాల కింగ్‌పిన్‌ల అప్పగింత, మరియు మాదకద్రవ్య ఉగ్రవాదం, డ్రగ్ కార్టెల్స్‌పై సమన్వయ చర్యల ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉంది.

## పిల్లల్ని కంటే 30 వేలు, 40 వేలు

తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర తో పాటు రాయల సీమ కోస్తా జిల్లాల అభ్యర్థులు అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. "రాష్ట్రం పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లోని రహదారులను శుభ్రపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతినెలా ఒకటో తేదీన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని అర్హులకు స్వయంగా పింఛన్లు అందించడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది.

### సగర్వంగా స్వచ్ఛత వైపు అడుగులు

'17 నెలలుగా మనం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్నాం. పరిసరాలు, పరిశుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది. మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే మన అలవాట్లు మారుతాయి. అలవాట్లు మారితే సమాజం మారుతుంది'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం అవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ. 3 లక్షలు. దీన్ని రాబోయే 22 ఏళ్లలో రూ. 54 లక్షలు చేయాలనే దిశగా ముందుకెళ్తున్నాం. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. పైన ఉండే 10 శాతం మంది కింద ఉండే 20 శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకు రావాలి. 2047 నాటికి మనదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుంది. ఆ దిశగా ప్రదాని మోదీ ముందుకెళు న్నారు'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### జూన్ నాటికి 100 శాతం చెత్త శుభ్రం

'ప్రజా ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగించాం. జూన్ కల్లా వందశాతం పూర్తవుతుంది. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులు 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు సిద్ధం చేస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఇవి అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తే డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు. నెట్ జీరో క్యాంపస్ లో భాగంగా హాస్టళ్ల నుంచి వ్యర్థాలు లేకుండా ప్రణాళిక చేశాం, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబు వంటివి అమలుచేస్తున్నాం. ప్రతీ నెలా 10, 20 తేదీల్లో ఈ-వ్యర్థాలు సేకరిస్తున్నాం. చెత్త సేకరణకు 200 ఈ-ఆటోలు వినియోగిస్తున్నాం. ఈ నెలాఖరు కల్లా కొత్తగా 5,000 పుష్ కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు తెస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతం గ్రీన్ కవర్ ఉంది. 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటికి 47 లక్షల కేజీల చెత్తను సేకరించి రూ.8 కోట్ల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. కొత్తగా గ్రీన్ షాప్స్ ను ప్రారంభించాం. ప్రజలే అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్ వంటి వ్యర్థాలను ఇచ్చి...వస్తువులు పొందవచ్చు. వావ్ పేరుతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు నిర్మిస్తున్నాం. నేటి నుంచి 50 ప్లాస్టిక్ వ్యర్థ యూనిట్లు వస్తుండగా మరో 210 యూనిట్లు జూన్‌కి అందుబాటులోకి తెస్తాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

### రాష్ట్రానికి మరిన్ని అవార్డులు రావాలి

'మన ఇల్లే కాదు. చుట్టూ ఉన్న పరిసరాలు, మన రహదారులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఊరి చివర్లో ఎక్కడ చూసినా చెత్తా-చెదారం కనిపించేది. అప్పుడే రహదారులను పరిశుభ్రంగా మార్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే స్వచ్ఛపథం పేరిట ఇప్పుడు కార్యక్రమం చేపడుతున్నాం'అని సీఎ చంద్రబాబు నాయుడు తెలిపారు. 'రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు వ్యర్థాలు పొంగిపొర్లకుండా మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను కూడా మనం వాడకుండా నిషేధం విధించుకోవాల్సిన అవసరం ఉంది. అత్యుత్తమ విధానాలను అనుసరించటం ద్వారా రాష్ట్రంలోని పంచాయితీలకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. కందులవారి పల్లె, చిత్తూరు జిల్లా, కాణిపాకం ఇలా వేర్వేరు పంచాయితీలు అత్యుత్తమ పనితీరు కనబరచడం ప్రభుత్వం చేస్తోన్న కృషికి దక్కిన ఫలితంగా భావిస్తున్నాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించే ఈ శాఖలో జాతీయ స్థాయిలో 8 అవార్డులు వచ్చాయి. మరిన్ని అవార్డులను రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు దక్కించు కోవాలని కోరుతున్నాను. ఇవాల్టి నుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్ రాష్ట్రంలో ప్రారంభం అవుతుంది. నెలరోజు పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాలుగు వారాల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. మున్సిపాలిటీలు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కించుకుంటాయని ఆకాంక్షిస్తున్నాను'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు తెలిపారు.

## సంపద సృష్టి కాదు..
# సంక్షోభ సృష్టి

మందగమనం ఉందనడానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాల్లో 9.60% వృద్ధి చూపి, వాస్తవంలో అది మైనస్ లోకి వెళ్లడం ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందన్నారు.

### రూ. 13,667 కోట్ల నష్టమా?

గత ప్రభుత్వ హయాంలో (2023-24) రాష్ట్ర పన్ను ఆదాయం రూ. 85,922 కోట్లుగా ఉందని జగన్ గుర్తు చేశారు. సాధారణంగా 8% వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా, ఈ రెండేళ్లలో ఆదాయం రూ. 1,00,219 కోట్లు ఉండాలని.. కానీ ఇప్పుడు కేవలం రూ. 86,552 కోట్లే వసూలైందని గణాంకాలతో వివరించారు. ఈ లెక్కన ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుమారు రూ. 13,667 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని, చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు.

### ఏపీఎండీసీ నిధులపై ఆరోపణలు

ఏపీఎండీసీ ద్వారా మే 2025లో సేకరించిన రూ. 9,000 కోట్ల ఎన్‌సీడీ నిధులను ప్రభుత్వం అక్రమంగా తన రెవెన్యూ ఖర్చుల కోసం వాడుకుందని జగన్ ఆరోపించారు. ఎటువంటి ఆస్తుల సృష్టి జరగకుండానే ఈ నిధులను మళ్లించారని, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఎన్‌సీడీ హోల్డర్లకు రాష్ట్ర కన్సోలిడేటెడ్ ఫండ్ యాక్సెస్ కల్పించారని మండిపడ్డారు. ఈ నిధులు కేవలం లెక్కలు సర్దుబాటు చేసేందుకే నాన్-టాక్స్ రెవెన్యూగా చూపించారని ఆయన విమర్శించారు.

### విధానపరమైన అవినీతి

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి విధానపరమైన పక్షపాతం, అవినీతి వల్ల వచ్చిందేనని జగన్ విమర్శించారు. ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అవాస్తవ వృద్ధి రేట్లను ప్రకటిస్తోందని, అప్పులు సేకరించడానికి అనారోగ్యకరమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటోందన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, ఇది భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు.

## ఈసారి ముందుగానే రుతుపవనాలు

మే 26నే తీరాన్ని పలకరించనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. మే 28 నాటికి పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఈ సానుకూల వార్తతో పాటే ఓ ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. ఎల్ నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ తన తొలి దశ అంచనాలో, జూన్-సెప్టెంబర్ మధ్య వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదై, సాధారణం కంటే తక్కువగా ఉంటుందని పేర్కొంది. రుతుపవనాలు ముందుగా రావడం, మొత్తం వర్షపాతానికి ప్రత్యక్ష సంబంధం ఉండదని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల సమయంలో ఏర్పడే అల్పపీడనాలపైనే వర్షపాతం ఆధారపడి ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ 'స్కైమెట్ వెదర్' వైస్ ప్రెసిడెంట్ మహేష్ పాలవత్ వివరించారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్నే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత ఉపఖండం వైపుగా వచ్చే తేమ గాలులు తగ్గిపోయి, వర్షపాతం తగ్గుతుంది. ఈ ఏడాది మే-జూలై మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 82 శాతం అవకాశాలు ఉన్నాయని అంచనా. గతంలో 2015-16లో తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో వర్షపాతం 86 శాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా మహారాష్ట్రలోని మరాఠ్వాడాలో 40 శాతం లోటుతో తీవ్ర నీటి కొరత, పంట నష్టం సంభవించింది. మొత్తం మీద, రుతుపవనాలు ముందుగా రావడం రైతులకు కొంత ఊరటనిచ్చే అంశమే అయినా, ఎల్ నినో ముప్పు నేపథ్యంలో వ్యవసాయం, నీటి నిల్వలు, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోలీసుల ఎదుట లొంగిపోయిన బండి భగీరథ్

వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం విచారణకు హాజరవుతానని చెప్పిన బండి భగీరథ్ విచారణకు హాజరు కాలేదు. మరోవైపు బండి భగీరథ్ దేశం విడిచి వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. అతడి కోసం ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం బండి భగీరథ్‌ను అతని కుటుంబసభ్యులు పోలీసులకు అప్పగించారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు కూడా బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన సంగతి తెలిసిందే. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. శుక్రవారం రాత్రి 9 నుంచి 12 గంటల వరకూ సుదీర్ఘ విచారణ అనంతరం ఈ దశలో బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసులో బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు శనివారం మరోసారి రికార్డు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలితో పాటుగా ఆమె తల్లి వాంగ్మూలం 40 నిమిషాల పాటు నమోదు చేశారు. ఈ కేసులో బాధితురాలి వాంగ్మూలాలను పోలీసులు ఇప్పటి వరకూ రెండుసార్లు నమోదు చేశారు.

### మే 8న పోక్సో కేసు నమోదు.. తానే బాధితుడ్ని అని కేసు పెట్టిన భగీరథ్

మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో భగీరథ్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు మేరకు మే 8న కేసు నమోదు అయ్యింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12లతో పాటు బీఎన్ఎస్‌లోని 74, 75 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ విచారణ సాగుతున్న సమయంలోనే తనను బ్లాక్ మెయిల్ చేసి ఫిర్యాదురాలి కుటుంబం డిమాండ్ చేసిందని బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ రెండు విచారణలకి కూడా ఆయన హాజరుకాలేదు. భగీరథ్ పేట్ బషీరాబాద్ పోలీసులు ఎదుట లొంగిపోవడంతో ఒక హైడ్రామాకు తెరపడింది. ఇప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతుంటే, న్యాయస్థానం ఇచ్చే తుది తీర్పుపై అందరి దృష్టి నెలకొంది. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తారా లేదా అన్నది మరికాసేపట్లో క్లారిటీ రానుంది.

## తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్‌ను ఓటరు తమ వద్దే అక్‌నాలెడ్జ్‌మెంట్ కింద ఉంచుకోవచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు కోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు
# సామాన్యుల పాలిట పిడుగుపాటు

నమ్మకాన్ని వంచించడమే అని అభిప్రాయపడ్డారు. రూ.3కు పైగా పెట్రోల్,డీజిల్ ధరలు పెంచడంవిశ్వాస ఘాతుకం అని అభిప్రాయపడ్డారు. ఇకనైనా ప్రధాని నరేంద్రమోడీ పెట్రోల్,డీజిల్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

### మోడీ అసమర్థ పాలన వల్లే ఈ దుస్థితి

'ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఈ నిర్ణయం అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం చూపుతుంది. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుంది'అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు అన్నది తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరింది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### యుద్ధాన్ని సాకుగా చూపించి రేట్లు పెంచడం సరికాదు

'ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే. ప్రపంచంలో భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుంది!?'అని ప్రధాని నరేంద్రమోడీ నిలదీశారు. 'ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం" అని పదే పదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారు. ఇది విశ్వాస ఘాతుకం అవుతుంది'అని సీఎం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలి అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## డిజిటల్ చెల్లింపుల్లో
# ప్రపంచంలోనే భారత్ టాప్

### - ప్రజాస్వామ్యానికి మనది మాతృదేశమన్న ప్రధాని

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్-నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు.

భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు.

మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదినోత్సవ ప్రత్యేక పూజలు: టిడిపి నాయకులు.



పలాస(ప్రశ్న న్యూస్ )సింహపురి వారసత్వం.. ప్రజా సేవలో సరికొత్త అధ్యాయం! పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు మందస "శ్రీ వాసుదేవ స్వామి" వారి ఆలయంలో మందస మండల టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అమ్మ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే ఎమ్మెల్యే మేడమ్ నాయకత్వంలో పలాస మరింత ప్రగతి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షిస్తూ.. ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వెల్లవేళల ఉండాలని కొనియాడారు.! ఈ కార్యక్రమం లో మందస మండల అధ్యక్షుల వారు బావన దుర్యోధన , కార్యదర్శి సాలీనా మాధవ రావు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, తమరియ భాస్కరరావు, బమ్మడి కర్రయ్య, రట్టి లింగరాజు, దూంకుర తిరుపతి, భైరిశెట్టి గున్నయ్య, నవీన్ యాదవ్, మహేశ్ రాజానా, బతకల వెంకట రావు, మురళి మోహన్ కృష్ణ, బేసి ఈశ్వర్ రావు, తదితర ముఖ్య నాయకులు, తెలుగు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.!

# గుంటూరులో కలుషిత త్రాగునీటి సరఫరాకు అవకాశం ఇవ్వరాదు

- కమిషనర్ మయూర్ అశోక్.

-అనుమానిత ప్రాంతాల్లో అమ్మోనియా పరీక్షలు తప్పనిసరి

-ప్రతి టెస్ట్‌ను సిఎంఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలి

-డ్రైన్‌లో పైప్‌లైన్‌పై ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం



గుంటూరు (ప్రశ్న న్యూస్)నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గుంటూరు నగరంలో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడంలో రాజీ ఉండబోదని, కలుషిత త్రాగునీటి సరఫరా జరగడానికి వీల్లేదని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శనివారం శ్రీనగర్, శారదా కాలనీ, సంజీవయ్య నగర్, సుగాలీ కాలనీ, శివనాగరాజు కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, జరుగుతున్న అభివృద్ధి పనులు, త్రాగునీటి సరఫరా పరిశీలించి అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో త్రాగునీటి పైప్‌లైన్‌లకు ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. పైప్‌లైన్‌లు డ్రైనేజీ లైన్లకు సమీపంలో ఉన్న ప్రాంతాలను గుర్తించి, వెంటనే సాంకేతికంగా పరిశీలించాలని సూచించారు. సుగాలీ కాలనీలో డ్రైన్‌లో త్రాగునీటి పైప్‌లైన్ ఉండడాన్ని గుర్తించి, ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా నిర్లక్ష్యం జరిగినందుకు సంబంధిత ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో తప్పనిసరిగా అమ్మోనియా టెస్టులు నిర్వహించాలని, ప్రతి రోజు నిర్వహించే నీటి నాణ్యత పరీక్షల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిర్వహించిన ప్రతి ఎమినిటి టెస్ట్‌ను వెంటనే సిఎంఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఇక నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై పేరుకుపోకుండా వెంటనే తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఖాళీ స్థలాలు, కాలనీల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) జి.సాంబశివరావు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎస్ఎస్ లు సాంబయ్య, ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు

# వైభవోపేతంగా శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు : టిటిడి

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన

టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

ఆధ్యాత్మిక శోభ కనిపించేలా ఏర్పాట్లు

మే 27న గరుడ సేవ - మే 30న రథోత్సవం



తిరుపతి(ప్రశ్న న్యూస్)శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు.

**తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.**

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు ఇతర అధికారులు పాల్గొన్నారు..

# మత్స్యకారులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా: కావలి

- ఎమ్మెల్యే, కావ్య క్రిష్ణారెడ్డి

- సీఎం రాక కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబాలు

ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాకతో దద్దరిల్లిన ఇసుకపల్లి పాలెం

మత్స్యకారుల గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా

కావలి(ప్రశ్న న్యూస్) కావలి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈనెల 19వ తేదీన తుమ్మలపెంటలో నిర్వహించనున్న "మత్స్యకారుల సేవలో" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అల్లూరు మండలం ఇసుకపల్లి పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లి పాలెంలో ఎమ్మెల్యే కి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఎమ్మెల్యే రాకతో గ్రామమంతా సందడిగా మారింది. గ్రామ వీధుల్లో భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, మత్స్యకార కుటుంబాలు చేరుకొని హారతులు పట్టి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే ని కలుసుకోవడంతో ఇసుకపల్లి పాలెం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గ్రామానికి వెళ్లి మత్స్యకార కుటుంబాలను స్వయంగా పలకరించారు. వారి సమస్యలు, జీవన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకార సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. తుమ్మలపెంటలో జరిగే సభకు ప్రతి మత్స్యకార కుటుంబం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మత్స్యకార కుటుంబాలతో సమావేశమవడం ఈ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కావలి నియోజకవర్గంలో ఉన్న మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా.. ప్రతి ఒక కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..గ్రామస్తులు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ప్రాంతానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మత్స్యకారుల సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రతి గ్రామంలో తిరుగుతూ



సభ విజయవంతం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మత్స్యకార మహిళలు ఎమ్మెల్యే ని కలిసి తమ కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం సభకు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారు. "కావలి ఎమ్మెల్యే మాకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు" అంటూ గ్రామస్తులు అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బీద గిరి ,స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మత్స్యకార కాపులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఉత్సాహం చూసిన నాయకులు సభను భారీ విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

- ప్రధాని మోదీకి కవిత లేఖ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం. "కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. "అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు.

# స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు

- ప్లాస్టిక్‌ను నిషేధించి, పర్యావరణాన్ని కాపాడుకుందాం



ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర (ూయాం) కార్యక్రమంను ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ లో మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలిసి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, (ూయాం) ప్రతిజ్ఞ ను కూడా చేశారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను గుణపం, పారలతో తీసివేశారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనీ, వస్త్ర సంచులు, జనపనార సంచులు, కాగితపు సంచులు వంటి వాటిని ఉపయోగించాలని, ఒక్కసారి ఉపయోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు ఏళ్ల పాటు ప్రకృతిలో కరుగకుండా ఉండి, మానవజాతికి, వన్యప్రాణులకు, మరియు సముద్ర జీవరాశికి ముప్పుగా మారుతున్నాయని, ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు గారు సూచించారు. మనం తీసుకునే చర్యలు రేపటి తరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని గుర్తించి, పరిశుభ్రతపై మనం చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చు.

# నవోదయలో సీట్లు కైవసం చేసుకున్న బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు

**శిరివెళ్ల** ప్రతిభను వెలికి తీసి ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం :- ప్రిన్సిపల్ మురళీమోహన్ మలిశెట్టి. శిరివెళ్ల (నంద్యాల, బొమ్మల సత్రం):- నంద్యాల పట్టణంలోని ద్వారకామయి కాంప్లెక్స్ బొమ్మల సత్రంలో వెలసినటువంటి బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగినటువంటి నవోదయ ప్రవేశ పరీక్షల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. చిక్కుడు వెంకట లహరి, పటాన్ నాజియ బాలికలు నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా జరిగినటువంటి ఎంట్రన్స్ పరీక్షల్లో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని తమ బ్రిలియంట్ స్టాండర్డ్ మెమోరీతో బనవాసి నవోదయలో సీట్లను సుస్థిరం చేసుకున్నారు. నిష్టాతులైన అధ్యాపకులు ఉత్తమ విద్య అత్యుత్తమ క్రమశిక్షణ విలువలు విశ్వసనీయతకు బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ నిలయంగా మారిందని ప్రిన్సిపాల్ మురళీమోహన్ మలిశెట్టి గారు పేర్కొన్నారు. తమ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్లో ఐఐటి, నీట్, సివిల్, ఫౌండేషన్, నవోదయ, సైనిక్, ఆర్ ఎం ఎస్ వంటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవిధంగా నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు సిలబస్ అర్థమయ్యే పద్ధతిలో నూతన టెక్నాలజీకి అనుగుణంగా బోధిస్తున్నట్లు తెలిపారు. సాధారణ టెస్టులు మాక్ టెస్ట్ లు గ్రాండ్ టెస్టులతో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు చిన్నారుల ప్రతిభను వెలికి తీస్తున్నామని అన్నారు. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచే కాలుష్య రహిత వాతావరణం రక్షణ కవచంలా క్యాంపస్ అనుభవజ్ఞులైన నిష్టాతులైన అధ్యాపకులచే విద్యాబోధనతో బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పలు ప్రవేశ పరీక్షల్లో జైత్ర యాత్ర కొనసాగిస్తూ విజయభావుట ఎగురవేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

# కొంత ప్రైవేటీకరణతోనే ఆర్టీసీకి ఊరట

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

**మచిలీపట్నం** రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ స్పష్టం చేశారూ ... కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ, ఒక్కో బస్సు ధర సుమారు రూ. 1.60 కోట్ల నుండి రూ. 1.70 కోట్ల వరకు పలుకుతోందని తెలిపారు.?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీ లేదా ప్రభుత్వానికి సాధ్యం కాని పని అని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే, వారే పెట్టుబడులు పెట్టి, బాడీ బిల్డింగ్ చేయించుకుని బస్సులను నడుపుతారని, దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు.?ఆర్థిక భారం.. ఎలక్ట్రిక్ బస్సుల ఆవశ్యకత?ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 10వేల బస్సులు నడుస్తున్నాయని, వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ. 15, వేల కోట్లు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆపరేటర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు.?అయితే, ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువని ఆయన వివరించారు?ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయనీ చెప్పారు

# మహిళ హత్య

**తిరువూరు** ఖమ్మం జిల్లా మధిర పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కృష్ణాపురంనక్కలగరుబు రోడ్డుమధ్యలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలో మహిళ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన జి. కల్పన(28)గా గుర్తించారు. ఆమె మధిరలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి అక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.సమాచారం అందుకున్న మధిర రూరల్ సీఐ మధు, రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# పాడి రైతులు ఇంధన పొదుపు చేయాలి

**హనుమాన్ జంక్షన్** ప్రధాని, ముఖ్యమంత్రి సూచనలతో ఇంధన పొదుపు చర్యలు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేపట్టారు. పాడి రైతులతో కలిసి అయన సైకిల్ యాత్ర చేసారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాల గ్రామాలకు సైకిల్పై ప్రయాణం సాగిస్తూ పాడి రైతులతో మాట్లాడారు. "పాడి రైతు సంక్షేమం మన మతం - అలుపెరగని సేవ మన అభిమతం" అనే కార్యక్రమంలో పాల్గొని ఇంధన పొదుపు చర్యలు ను రైతులకు వివరించారుఏ.చలసాని ఆంజనేయులు మట్లాడుతూ రైతుల సమస్యలు, పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు సంక్షేమం, సహకార రంగ బలోపేతంపై నే మా ఆలోచన. సమితి చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరూ తెలుసుకోవాలి. రైతులు అందరూ వారానికి ఒకరోజు ఇంధన పొదుపు చేస్తూ సైకిల్, ఇతర ఇంధనేతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్నారు. ఇంధన పొదుపు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పర్యావరణ హిత జీవన విధానాలను అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**తిరుపతి** మే 16 "జాతీయ డెంగ్యూ దినోత్సవం" సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జీ.కే. రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు " మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎం పి హెచ్ ఈ ఓ లు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), కార్యాలయ సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాలు అందరూ శుభ్రంగా ఉంచుకోవాలి

- మండల అధికారి అమీరున్నిసా బేగం

**ఆత్మకూరు**దకొత్తపల్లి మండలం గువ్వలగుంట్ల గ్రామంలో 3 వ శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గువ్వలగుంట్ల గ్రామ పంచాయతీ కి స్పెషల్ ఆఫీసర్ అయిన మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం లో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని అని పిలుపునిచ్చారు అదేవిధంగా మనం ఆరోగ్యంగా ఉండాలంటే మొదటగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత అనేది మన జీవితంలో చాలా ముఖ్యం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా మనం నియంత్రించవచ్చు. అంతేకాదు, పరిశుభ్రంగా ఉన్న చోట మనసుకు ప్రశాంతత కూడా ఉంటుంది అనిఆమె తెలిపారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంని తగ్గించాలి. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సిబ్బంది, ప్రజలు,పాల్గొన్నారు.

# యువత మహనీయుల స్ఫూర్తితో రాజకీయాల్లోకి రావాలి

**- బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు**
**- అతికం రాజశేఖర్ గౌడ్ పిలుపు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) విద్యార్థులు, యువత మహనీయులైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందుల స్ఫూర్తితో రాజకీయాల్లోకి రావాలని సామాజిక ఉద్యమకారుడు, బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన బోయినిపల్లి మండల కేంద్రంలో ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2009 నుంచి 2026 వరకు గత 17 ఏళ్లుగా విద్యార్థి, యువజన, సామాజిక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నానని తెలిపారు. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు, అవమానాలు ఎదురైనా ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలీసు కేసులను కూడా ఎదుర్కొన్నానని, అయినప్పటికీ ఎక్కడా వెనక్కి తగ్గలేదని అన్నారు.మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత యువతపై ఉందని, సమాజ సేవా భావంతో యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు, యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించేలా సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్, నాయకులు నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ ఆడేందుకు వెళ్లిన యువకుడిపై దాడి, ఐ ఫోన్, నగదు దోపిడీ

**- చంపేస్తామని బెదిరింపులు - ముగ్గురి అరెస్టు**
**- నిందితుల నుండి కారు,ఐ ఫోన్, నగదు స్వాధీనం**
**- కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : ఏ. నిరంజన్ రెడ్డి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్‌లో యువకుడిని చితకబాది చంపేస్తామని బెదిరించి ఐఫోన్, నగదు లాక్కున్న ముగ్గురు నిందితులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వావిలాలపల్లికి చెందిన రోహన్ అనే యువకుడు క్రికెట్ ఆడేందుకు వెళ్లగా దావ దర్శన్, రోహిత్ కుమార్ అలియాస్ రిషి, కొనగాని మధు కలిసి అతడిని బెదిరించి ఐఫోన్ లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు శనివారం బొమ్మకల్ బైపాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు, ఐఫోన్, మరో మూడు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# మూసినాలలో లక్షల రూపాయల కాంట్రాక్ట్ వృథా

**అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతపూర్ భగవత్ మూసి నాలాలో గుర్రపు డెక్క తొలగింపు పనుల కోసం లక్షల రూపాయల కాంట్రాక్ట్ మంజూరు చేసినప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కేవలం ఫోటోలకు మాత్రమే పరిమితమై, గుర్రపు డెక్క తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ ఈరోజు – – రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు విజయేందర్ రెడ్డి విమర్శించారు.

ఉప్పల్ సర్కిల్లో ప్రజా ధనాన్ని వృథా చేస్తున్న నిర్లక్ష్య అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, పనులను పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు ఎక్కడ నిర్లక్ష్యం వహించొద్దని పలుమార్లు తెలిపిన ఉప్పల్ సర్కిల్లో మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్య గా ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని, ప్రజలు పలుమార్లు సమస్యలపై అధికారులకు తెలిపిన అధికారులు పట్టించుకోకుండా ఫోన్లు కూడా ఎత్తడం లేదని అలాంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పేదల పొట్టకొట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు

**- ముందస్తు నోటీసులు లేకుండానే కూల్చివేతలు - కేఎల్ఆర్ వెంచర్ ప్రాంతంలో బాధితుల కన్నీరుమున్నీరు**







మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్ ప్రాంతం శుక్రవారం ఉదయం ఒక్కసారిగా రణరంగంగా మారింది. ట్రాఫిక్ సమస్యలు, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు పేరుతో రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు చిరు వ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపించారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం సామాగ్రిని సర్దుకునే సమయం కూడా ఇవ్వకుండా జేసీబీలతో వచ్చి టీ కొట్లు, చిన్నపాటి బడ్డీ కొట్లను క్షణాల్లో నేలమట్టం చేశారు. చట్టం అందరికీ ఒక్కటేనని చెప్పే పాలకులు, క్షేత్రస్థాయిలో మాత్రం బలవంతుడికి ఒక న్యాయం.. బలహీనుడికి మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### బడా నిర్మాణాలకు 'మౌనముద్ర'.. బడుగుల బతుకులకు ఉరితాడు :


మేడ్చల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా వెలుస్తున్న భారీ అక్రమ కట్టడాల విషయంలో అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో పదుల సంఖ్యలో అక్రమ షెడ్ల నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం.. రోడ్డు పక్కన బతికే పేదలపై మాత్రం చట్టం అమలు చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బడా వ్యాపారుల నుండి భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లు కుమ్మరించే వాళ్లకు ఒక చట్టం.. పది రూపాయలు సంపాదించుకునే మాకు మరో చట్టమా ? అని బాధితులు అధికారులను నిలదీస్తున్నారు.

### అధికార పార్టీలోనే 'అధికారిణి'పై తిరుగుబాటు.. వాట్సాప్ లీకులతో రచ్చ :

ఈ కూల్చివేతల ఉదంతం స్థానికంగా పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది. స్వయానా అధికార పక్షానికి చెందిన నాయకుడే వివిధ వాట్సాప్ గ్రూపులలో మేడ్చల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారిని సస్పెండ్ చేయాలి...

ఆమె అవినీతి తారాస్థాయికి చేరింది. గరీబోళ్లకు ఒక న్యాయం, బలిసినోళ్లకు ఇంకో న్యాయం చేస్తోంది. తొందరలోనే ఆమె నిజస్వరూపం బయటపడుతుంది అంటూ అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత ఒకరు చేసిన వాట్సాప్ మెసేజ్ ఇప్పుడు పట్టణంలోని వాట్సాప్ గ్రూపులలో జోరుగా వైరల్ అవుతోంది. అధికార పార్టీ నేతలే స్వయంగా టీపీఓ అవినీతిపై మాట్లాడటం పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

### పెద్ద తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఈ 'ఫుట్ పాత్' క్లియరెన్స్ డ్రామా :


~ Guvva Ravi Mudhiraj +91 97342 49999
టౌన్ ప్లానింగ్ అధికారులను అడుగుతున్న. పేద కుటుంబాలకు ఒక న్యాయం. ఆర్థికంగా బలిసినోడికి ఒక న్యాయమా..?...

మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారిని సస్పెండ్ చెయ్యాలి.....ఆమె అవినీతి తరాస్థాయి కి చేరింది. గరీబోళ్లకు ఒక న్యాయం బలిసినోళ్ళకు ఇంకో న్యాయం చేస్తుంది.

తొందరలో ఆమె నిజస్వరూపం బయటపడుతుంది.
3:55 PM

మరోవైపు, స్థానిక బీజేపీ నాయకులు కూడా అధికారుల తీరును తీవ్రంగా ఎండగట్టారు. మేడ్చల్ పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి, అలాగే అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలను తోసిపుచ్చడానికే ఈ 'ఫుట్ పాత్ క్లియరెన్స్' డ్రామా ఆడారని ఆరోపించారు. అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోలేని చేతకాని అధికారులు, సామాన్య ప్రజల పొట్టకొట్టడం దుర్మార్గమని విమర్శించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పక్షపాత వైఖరి వీడి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం పంచసూత్రాలు

**షాపుల ముందు చెత్త వేస్తే చర్యలు తప్పవు**
**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు.**



నరసరావుపేట (ప్రశ్న న్యూస్) స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌లో భాగంగా నరసరావుపేటను ప్లాస్టిక్ రహిత, పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత జీవితానికి పంచసూత్రాలు అనే బ్యానర్‌ను ప్రదర్శించారు.ఎమ్మెల్యే అరవింద్ బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం పంచసూత్రాలను అమలు చేయాలని అన్నారు. జూట్ లేదా గుడ్డతో చేసిన చేతి సంచులతోనే సరుకులకు వెళ్లాలని అన్నారు. ప్లాస్టిక్ నీటి బాటిళ్లకు బదులు రాగి/స్టీల్ బాటిళ్లను వాడాలన్నారు. హోటళ్లలో గాజు, స్టీలు పాత్రల్లోనే టీ, టిఫిన్ చేయాలన్నారు. నిషేధిత వస్తువులైన ప్లాస్టిక్ పూలదండలు, స్ట్రాల వాడకం పూర్తిగా మానేయాలన్నారు. వివాహ విందుల్లో ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసుల స్థానంలో స్టీలు, మట్టి పాత్రలను మాత్రమే వాడాలన్నారు.

గత రెండేళ్లుగా ప్రతి నెల శనివారం ఉదయం మార్కెట్ సెంటర్‌లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో యువకులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరవుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డీసీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. షాపుల్లో ప్లాస్టిక్ వస్తువుల అమ్మకానికి వీల్లేదని, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ గ్లాసులను పూర్తిగా నిషేధించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వాటి స్థానంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాస్లు, స్టీల్ టిఫిన్లు వాడాలని, షాపులకు జూట్ బ్యాగులు అందించి వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.


# పరోక్షసేవగా బయలు వీరభద్రస్వామివారి విశేషపూజ



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) అమావాస్యను పురస్కరించుకుని శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామి వారికి దేవస్థానం విశేషపూజలను నిర్వహిస్తున్నది. ఈ సాయంకాలం పూజాదికాలు నిర్వహించబడుతాయి ప్రతీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది. కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 28 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, తమిళనాడు, న్యూ ఢిల్లీ తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు. కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది. ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వకార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించండి : ఎంపీ గురుమూర్తి

**నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయండి**
**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ గురుమూర్తి**



తిరుపతి(ప్రశ్న న్యూస్ ) పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, అలాగే డిజిటల్ విద్యా సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు.రేణిగుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు.సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, దీని ద్వారా నెల్లూరు జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అంబేద్కర్ నగర్ అండర్‌పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పూరి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.

# రైతుల పంటలకు మద్దతు ధరల పెంపు మోసపూరితం

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ విమర్శ**
**ఎరువుల ధరలు 20% పెంచి, పంటల మద్దతు ధరలు 8% శాతం మాత్రమే పెంచుతారా**




ఏలూరు (ప్రశ్న న్యూస్) రైతుల పంటలకు మద్దతు ధరల పెంపు మోసపూరితమని, ఎరువుల 20 శాతం పెంచి పంటల మద్దతు ధరలు కేవలం 8 శాతం మాత్రమే పెంచి కేంద్ర ప్రభుత్వం రైతులను మోసగించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సూర్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఏలూరు పవర్ పేట అన్నే భవనంలో కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలపై వారు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 14 వ్యవసాయ పంటలకు మద్దతు ధరలు ప్రకటించిందన్నారు.కనిష్టంగా వరికి 3శాతం ( గ్రేడ్ ఏ రకం వరికి 2,389 నుండి 2,461), వేరుశనగ 3.5 శాతం (7,263 నుండి 7,517), మొక్కజొన్న 00.1 శాతం (2,400 నుండి 2,410) గరిష్టంగా పొద్దుతిరుగుడు 8.1 శాతం (7,721 నుండి 7,343), జొన్నలు 8.6 శాతం 3749 నుండి 4,073) కు ఇలా రానున్న ఖరీఫ్ సీజన్ కు 14 రకాల వ్యవసాయ పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతూ చేసిన నిర్ణయం రైతులను మరోసారి మోసం చేసేదిగా ఉన్నన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పెట్టుబడిపై 50 శాతం ఆదాయం కలిపి ఈ ధరలు నిర్ణయించినట్లు రైతులకు ఈ మద్దతు ధర పెద్ద ఊరట ఇస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఇంతకు మించిన దగా మరొకటి లేదని విమర్శించారు.

## శ్రీకాళహస్తి ఆలయంలో శని జయంతికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఈరోజు శని జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, పరమ పవిత్రమైన శ్రీకాళహస్తి దేవాలయాన్ని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని శనీశ్వర స్వామి వారి అభిషేక మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొని,ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించాము అనంతరం శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని వేదా పండితులు స్వామి అమ్మవారు చిత్రపటం తీర్థప్రసాదాలు శీర్వచనాలు అందుకున్నాము స్వామి, అమ్మవార్ల దివ్య ఆశీస్సులు మన నియోజకవర్గ ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించాను దర్శనానంతరం ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్లు, క్యూ లైన్లు మరియు ఆన్‌లైన్ సిస్టమ్‌ను స్వయంగా పరిశీలించాను. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దర్శనం సులభంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించాను అలాగే ప్రసాదాల నాణ్యతపై, ఇతర వసతులపై అక్కడ ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది.

## ధరల నియంత్రణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

- ధరలు తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం
- సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి : కడారి రాములు ఫైర్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని మున్సిపల్ కార్యాలయం ముందు సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి కడారి రాములు ఆధ్వర్యంలో పెరిగిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం సామాన్యుడు నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట నూనె, గ్యాస్, పెట్రోల్, డీజిల్ తదితర నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వావిలాల నర్సయ్య, తుపాకుల ఎల్లయ్య, రాగుల లింగం, కుమార్ తదితర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## ఐతే జల్లెడ.. లేదంటే తరుగు

- మేడ్చల్ మండలంలో రైతులపై రైస్ మిల్లర్ల జులూం
- నిబంధనల ప్రకారం జల్లెడ పట్టినా లారీల నిలిపివేత
- డబిల్ పూర్, మేడ్చల్, పూడూరు సొసైటీల పరిధిలో తీవ్ర ఇబ్బందులు
- కలెక్టర్, డీసీఓలు స్పందించి న్యాయం చేయాలని మాజీ పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి డిమాండ్



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్, మేడ్చల్ మరియు పూడూరు సొసైటీల పరిధిలో వరి ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన మిషన్లతో ధాన్యాన్ని పూర్తిగా జల్లెడ పట్టి లారీల్లో పంపిస్తున్నప్పటికీ, మిల్లర్లు మాత్రం ఏదో ఒక సాకుతో లారీలను మిల్లుల వద్దే నిలిపివేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

### తడిసి మోపెడవుతున్న ఖర్చులు.. మళ్లీ తరుగు పేరిట దోపిడీ..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం జల్లెడ పట్టడానికి, రవాణా ఖర్చులకే రైతులకు ఇప్పటికే తడిసి మోపెడవుతోంది. అంతంతమాత్రం పెట్టుబడులతో కాలం వెళ్లదీస్తున్న రైతులకు.. ఇంత చేసి ధాన్యం మిల్లుకు పంపితే, అక్కడ మళ్లీ 'పొల్లు ఉందనే' సాకుతో లారీలను ఆపేస్తున్నారు. అంతటితో ఆగకుండా జల్లెడ పట్టిన ధాన్యానికి కూడా మళ్లీ 'తరుగు' పేరిట కటింగ్ చేస్తామని రైస్ మిల్లర్ల యజమానులు భీష్మించుకు కూర్చోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ధాన్యం దిగుమతి కాకపోవడం, మరోవైపు తరుగు రూపంలో అదనపు నష్టం వాటిల్లితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి : ఎల్లంపేట పురపాలక 16వ వార్డు కౌన్సిలర్, డబిల్ పూర్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి

ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ జల్లెడ పట్టిన ధాన్యాన్ని కూడా రైస్ మిల్లర్లు తిరస్కరించడం లేదా తరుగు పేరిట వేధించడం అన్యాయం. ఇప్పటికే రైతులు సకాలంలో ధాన్యం తరలించలేక, పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారి వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి. రైస్ మిల్లుల్లో సకాలంలో ధాన్యం దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకుని, మిల్లర్ల వేధింపుల నుండి రైతులకు పూర్తి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అధికారుల నిర్లక్ష్యానికి 'సమాచార హక్కు' బోర్డే సాక్ష్యం

- బదిలీ అయి 15 రోజులు దాటినా మారని అప్పిలేట్ అధికారి పేరు
- కార్యాలయం ముందే దర్శనమిస్తున్న పాత బోర్డు గందరగోళంలో సమాచార అర్జీదారులు









మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుతోంది. సమాచార పారదర్శకత కోసం ఉద్దేశించిన సమాచార హక్కు చట్టం - 2005 బోర్డుల నిర్వహణలోనే అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. ఇందుకు నిదర్శనమే ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ఉన్న సమాచార బోర్డు.

### బదిలీ అయినా.. బోర్డుపైనే పాత అధికారి పేరు..

ఎల్లంపేట పురపాలక కార్యాలయంలో అప్పిలేట్ అధికారిగా విధులు నిర్వహించిన అజ్మీర స్వామి నాయక్ ఇక్కడి నుండి బదిలీ అయి దాదాపు 15 రోజులు గడుస్తోంది. ఆయన స్థానంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారి విధుల్లో చేరినప్పటికీ, కార్యాలయ ప్రధాన ద్వారం పక్కన ఏర్పాటు చేసిన అధికారిక బోర్డులో మాత్రం ఇప్పటికీ పాత అధికారి పేరు దర్శనమిస్తుంది.

### గందరగోళంలో సమాచార అర్జీదారులు..

వివిధ సమాచారాలు, ప్రజా సమస్యల నిమిత్తం పురపాలక కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు, అర్జీదారులు ఈ బోర్డును చూసి తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.
అత్యవసర సమాచారం కోసం వచ్చిన అర్జీదారులు బోర్డుపై ఉన్న పాత కమిషనర్ పేరు ప్రస్తుతం ఉన్న కమిషనర్ పేరు వేరు వేరుగా ఉండడంతో ఎవరికి అప్పీల్ చేయాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బోర్డుపై ఉన్న పేరును అప్‌డేట్ చేయాలనే కనీస బాధ్యత కూడా ఇక్కడి సిబ్బందికి, ఉన్నతాధికారులకు లేకపోవడం వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

### ఇప్పటికైనా స్పందించేనా.?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమాచార హక్కు చట్టం బోర్డులపై ఎప్పటికప్పుడు తాజా అధికారుల వివరాలు స్పష్టంగా ఉంచాలి. కానీ ఎల్లంపేట పురపాలక సంఘంలో మాత్రం ఆ నిబంధనలు తుంగలో తొక్కారు.
కంటి ముందే కనిపిస్తున్న ఈ తప్పును సరిదిద్దడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే పాత అధికారి పేరును తొలగించి, ప్రస్తుత అప్పిలేట్ అధికారి వివరాలను బోర్డుపై నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## క్రషర్ ఏర్పాటును రద్దు చేయాలని కలెక్టరేట్ ముందు ధర్నా





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా రావల్ కోల్ గ్రామంలోని సర్వే నెంబర్ 111 లో ఏర్పాటు చేస్తున్న నూతన క్రాషర్ నీ వెంటనే రద్దు చెయ్యాలని రావల్ కోల్ గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేశారు.రావల్ కోల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్రషర్ కు సంబంధించి గత నాలుగు సంవత్సరాల క్రితం 2021 నవంబర్ నెలలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు అందరూ కలిసి ఈ క్రషర్ కు వ్యతిరేకంగా తీర్మానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన అప్పటి జిల్లా అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి ప్రజల అభిప్రాయాలను విన్న తర్వాత ఈ క్రషర్కు అనుమతులు ఇవ్వకుండా ఆపడం జరిగిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఈ సంవత్సరం 2026 ఫిబ్రవరి నెలలో మైనింగ్ కి అనుమతులు ఇస్తున్నట్టుగా ఏడి పేరు మీద ఒక లెటర్ రావడం చాలా ఆశ్చర్యానికి గురి చేసింది అని గ్రామస్తులు అన్నారు, నాలుగు సంవత్సరాల క్రితం జరిగినటువంటి ప్రజాభిప్రాయ సేకరణకు ఇప్పుడు ఇచ్చినటువంటి లెటర్ కు ఎలాంటి సంబంధం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పుడున్న అధికారులకు గత నెల రోజుల నుండి కింది స్థాయి నుండి పై స్థాయి వరకు ప్రతి ఒక్క అధికారికి లెటర్లు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ కు ప్రజావాణిలో దాదాపు మూడుసార్లు లెటర్లు ఇచ్చిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈరోజు కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలకు కూర్చున్నామని వివరించారు, ఈ ప్రతిపాదిత క్రషర్ కు ఆనుకొని వ్యవసాయ పంట పొలాలు ఉన్నాయని, పది అడుగుల దూరంలో ఇందిరమ్మ ఇండ్లు, 200 మీటర్లు ఆశ్రమము, 500 మీటర్ల కు దగ్గరగా రావల్ కోల్ గ్రామము, కాసంబై తండా, గుబ్బడి గుట్ట తండా, దొంగలు గుట్ట తండా ఉన్నాయని వివరించారు. ఈ 111 సర్వే నెంబరు ఆర్ వన్ జోన్ లో ఉన్నదని, ఈ క్రాషర్ కి అనుకోని హెచ్ఎండిఏ వెంచర్లు ఉన్నాయని అలాంటి సందర్భంలో ఏ విధంగా అనుమతులు ఇస్తారని మండిపడ్డారు.
అసలు గ్రామపంచాయతీ ఎన్ ఓ సి లేకుండా మున్సిపల్ ఎన్ఓసి లేకుండా అనుమతులు ఇవ్వడం అంటే ఇది ఇల్లీగల్ సంబంధించినటువంటి మైనింగ్ అని వాళ్ళు వివరించారు. 111 సర్వే నంబర్లో ఏర్పాటు చేస్తున్న క్రషర్ ఓనర్ పేరు జయ రెడ్డి అని ఈ జయ రెడ్డి భర్త జీవిత్ రెడ్డి కి ఇంతకుముందు మునిరాబాద్ గ్రామంలో ఒక క్రషర్ ఉండేదని ఈ క్రషర్ సంబంధించినటువంటి మైనింగ్ డబ్బులను దాదాపు 20 కోట్లకు పైగా ప్రభుత్వానికి కట్టాల్సి ఉంటే ఆ డబ్బులను ఎగ్గొట్టడం వల్ల మైనింగ్ అధికారులు ఆ క్రషర్ నీ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.ఒక వ్యక్తికి సంబంధించిన క్రషరు సీజ్ చేస్తే ఆ కుటుంబంలో ఉన్నటువంటి వారికి ఎవరికీ మళ్ళి ఇంకో క్రషర్ సాంక్షన్ చేయడానికి అవకాశం లేదని కానీ ఇక్కడ ఏడి మైన్స్ అధికారి ఈ విషయాలను పట్టించుకోకుండా వాళ్లకు మళ్లీ ఇంకో క్రషర్ కు అనుమతి ఇవ్వడం అంటే దీని వెనకాల ఎదో జరిగిందని అర్థమవుతుందని వారు పేర్కొన్నారు.వెంటనే ఈ క్రషర్ అనుమతులను రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రావల్ కోల్ గ్రామస్తులు మందపురం నరేష్, మామిండ్ల వెంకటేష్, మామిండ్ల ఆనంద్, బంటు నర్సింగరావు, బంటు మల్లేష్, సుక్క శేఖర్, గడీల రమేష్, ఎర్రవల్లి హారత్ రెడ్డి, గున్నాల రాము గౌడ్, తెడ్డు రాజారామ్, మామిండ్ల గణేష్, ఎక్కలదేవి శ్రీశైలం, గుమ్మడి బిక్షపతి, పిట్ల సాయి శ్రావణ్, పిట్ల శ్రీధర్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల కళ్లెదుటే పెద్ద చెరువు వినాశనం

- చర్యలు శూన్యం.. నిర్లక్ష్యం ఘోరం
- రెండు నెలలుగా ప్రజావాణిలో మొరపెట్టుకున్నా కదలని యంత్రాంగం
- సీఎంఆర్ కాలేజీ కలుషిత నీరు, అక్రమ ర్యాంప్‌లపై చేతులు దులుపుకుంటున్న అధికారులు
- సుదీర్ఘ పోరాటానికి దిగుతాం :పాతూరి సుధాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పెద్ద చెరువు అక్రమార్కుల పాలిట కామధేనువుగా మారుతుంటే, ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర బీజేపీ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువును కాలుష్య కోరల నుండి, అక్రమ నిర్మాణాల నుండి కాపాడాలంటూ గత రెండు నెలలుగా 'ప్రజావాణి'లో జిల్లా కలెక్టర్‌కు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నా, క్షేత్రస్థాయి అధికారుల్లో కనీస స్పందన కరువైందని ఆయన మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం మేడ్చల్ జిల్లా ఇరిగేషన్ డీఈ జైపాల్ రెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు కలిసి పెద్ద చెరువు పరివాహక ప్రాంతంలో సంయుక్తంగా విచారణ జరిపారు. అయితే ఈ దర్యాప్తు కేవలం నామమాత్రంగానే సాగిందని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకునే ఉద్దేశం అధికారుల్లో ఎక్కడా కనిపించలేదని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

### - కాలుష్య కాసారంగా మారుస్తున్నా చర్యలేవి..

మేడ్చల్ పెద్ద చెరువులోకి సీఎంఆర్ కళాశాల నుంచి సుతారిగూడం చెరువులోకి అక్రమంగా కాల్వలు తవ్వి రసాయన, కలుషిత నీటిని యథేచ్ఛగా వదులుతున్నారని పాతురి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. దీనివల్ల చెరువు నీరు పూర్తిగా విషతుల్యంగా మారి, స్థానిక పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పష్టమైన ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, కాలుష్య నీటిని అడ్డుకోవడంలో ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

### - కట్టపై అక్రమ ర్యాంప్‌లు.. అధికారుల అండదండలు

పెద్ద చెరువు కట్టపై నిబంధనలకు విరుద్ధంగా రెండు అక్రమ ర్యాంప్‌లను నిర్మించి, చెరువు ఉనికికే ప్రమాదం తెస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపించారు. కళ్లెదుటే అక్రమ నిర్మాణాలు స్పష్టంగా కనిపిస్తున్నా, వాటిని తక్షణమే కూల్చివేయడానికి అధికారులు వెనుకాడుతుండటం వెనుక ఉన్న అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అధికారుల ఈ మెతక వైఖరి అక్రమార్కులకు కొమ్ముకాయడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### - సుదీర్ఘ పోరాటానికి దిగుతాం
### - పాతూరి సుధాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు

రెండు నెలలుగా మేము నిరంతరం పోరాటం చేస్తున్నా అధికారుల్లో కనీస చలనం లేకపోవడం విచారకరం. అధికారులు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోకపోతే, ఇకపై మేము ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగం. కలిసివచ్చే ప్రజాసంఘాలు, స్థానికులను ఒకతాటిపైకి తెచ్చి చెరువు రక్షణ కోసం సుదీర్ఘ పోరాటానికి దిగుతాం.

## రాజన్న సన్నిధిలో సేవ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది

- పట్టణాభివృద్ధి కి ప్రాధాన్యత ఇస్తా - నూతన మున్సిపల్ కమిషనర్ : లోకేష్
- వేములవాడ మున్సిపల్ కమిషనర్‌గా లోకేష్ బాధ్యతల స్వీకరణ



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా లోకేష్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రూప్-1 అధికారిగా తనకు మొదటి పోస్టింగ్ వేములవాడలో రావడం ఎంతో ఆనందంగా ఉందని, అదీ రాజన్న సన్నిధిలో సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.



# విజయ్ చాలా సరదాగా ఉంటారు

## మాళవిక మోహనన్

టాలీవుడ్, కోలీవుడ్‌లలో వరుస క్రేజీ ఆఫర్లు అందుకుంటూ హీరోయిన్ మాళవిక మోహనన్ దూసుకుపోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'మాస్టర్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలను ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. 'మాస్టర్' సినిమా మొదటి రోజు షూటింగ్‌లోనే తనకు చాలా కష్టమైన సీన్ ఎదురైందని, దానివల్ల తన ఫోకస్ మొత్తం డైలాగ్స్‌పైనే పెట్టాల్సి వచ్చిందని మాళవిక తెలిపారు. అయితే, విజయ్ మాత్రం ఎంతటి కష్టమైన సీన్ అయినా సరే.. ఎంతో ప్రశాంతంగా (కూల్‌గా), ప్రతి చిన్న విషయంపై దృష్టి పెడుతూ నటిస్తారని ఆమె కొనియాడారు. సెట్స్‌లో ఆయన అందరితో చాలా సరదాగా ఉంటారని చెప్పారు. మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ మోస్ట్ సూపర్ స్టార్ల నుంచి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని మాళవిక వెల్లడించారు. ముఖ్యంగా వారి టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అని చెబితే.. వారు ఉదయమే 6.55 కల్లా సెట్స్‌లో హాజరవుతారని స్పష్టం చేశారు. అంతటి పెద్ద స్టార్స్ సమయపాలన పాటించడం వల్లే ఇండస్ట్రీలో నిర్మాతలకు భారీగా డబ్బు వృథా కాకుండా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నేటి యువతకు లవ్, రిలేషన్ అంటే ఏమిటో

# తెలియదు: తమన్నా



హీరోయిన్ తమన్నా భాటియా నేటితరం యువతకు ప్రేమ, బంధాల (రిలేషన్స్) పై సరికొత్త లెక్చర్లు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి ఆమె సమయం దొరికినప్పుడల్లా ప్రేమకు సంబంధించిన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అసలు వీరిద్దరి బంధం పెళ్లి వరకు వెళుతుందని అందరూ అనుకుంటే, ఎందుకు సడన్‌గా విడిపోయింది, తమన్నాను విజయ్ వర్మ ఏమైనా అనుమానించారా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలను ఇప్పటివరకు ఈ జంట అధికారికంగా బయటపెట్టనప్పటికీ, తాజాగా తమన్నా చేసిన వ్యాఖ్యలు వారి బ్రేకప్ కారణాలపై పలు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చని మరియు అదే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, మన భావాలను వారిపై బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేమని స్పష్టం చేశారు. ప్రేమ అనేది కేవలం ఒకే ఒకసారి కలిగే అనుభవం కాదని, అది జీవితంలో అనేకసార్లు జరగాల్సిన ప్రేరణ అని పేర్కొంటూ, ఇది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేది కాదని, అంతర్లీనంగా పుట్టే ఒక భావోద్వేగమని తమన్నా వివరించారు. ఆమె చెబుతున్న ఈ మాటలను బట్టి చూస్తే, ప్రేమ విషయంలో ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోంది.

# 'కర్తవ్య' మూవీ రివ్యూ!



సైఫ్ అలీ ఖాన్ కథానాయకుడిగా నటించిన సినిమానే 'కర్తవ్య'. గౌరీఖాన్ నిర్మించిన ఈ సినిమాకి 'పుల్కిత్' దర్శకత్వం వహించాడు. సైఫ్ అలీ ఖాన్ పోలీస్ ఆఫీసర్ గా నటించిన ఈ సినిమాను నేరుగా ఈ నెల 15వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. హిందీతో పాటు ఇతర భాషలలోను ఈ సినిమా అందుబాటులో ఉంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్ లో సాగే కథ ఇది. పవన్ (సైఫ్ అలీ ఖాన్) ఓ సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. నిజాయితీ .. క్రమశిక్షణకు నిదర్శనంలా ఆయన కనిపిస్తుంటాడు. తండ్రి హరిహర్ .. తమ్ముడు దిలీప్ .. భార్య వర్ష (రసిక దుగల్) కొడుకు హనీ .. ఇదే అతని కుటుంబం. పవన్ ఫ్యామిలీ నివసిస్తున్న ఆ గ్రామంలో కట్టుబాట్లు చాలా కఠినంగా ఉంటాయి. పరువు హత్యలు ఆ గ్రామంలో ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో పవన్ తమ్ముడు దిలీప్, ప్రీతి అనే ఒక యువతిని తీసుకుని పారిపోతాడు. ఆనంద్ శ్రీ అనే ఒక స్వామిజీపై అనేక వివాదాలు ఉంటాయి. చాలామంది టీనేజ్ అమ్మాయిలు కనిపించకుండా పోవడం వెనుక ఆయన హస్తం ఉందనేది చాలామంది అభిప్రాయం. స్వామిజీ ముసుగులో అతను చేస్తున్న అరాచకాలను గురించి రాసిన జర్నలిస్ట్ 'రీమా'ను కొంతమంది ఆగంతకులు షూట్ చేసి పారిపోతారు. పవన్ కళ్లముందే ఆమె చనిపోతుంది. 'రీమా'ను షూట్ చేసింది ఒక మైనర్ అని తెలుసుకుని పవన్ షాక్ అవుతాడు. 'రీమా'ను హత్య చేయించిన ఆనంద్ శ్రీ, మైనర్ కుర్రాడైన 'హర్పాల్' ను చంపడానికి తన ప్రధానమైన అనుచరుడైన 'నిర్మల్'ను పంపిస్తాడు. స్వామిజీ మనిషిగా పోలీస్ ఆఫీసర్ 'కేశవ్' కూడా హర్పాల్ కోసం గాలిస్తూ ఉంటాడు. తమ ఊరు పెద్దల కంటపడకుండా దీపక్ – ప్రీతిలను రహస్యంగా ఒక ఇంట్లో దాచిన పవన్, ఆనంద్ శ్రీ మనుషులకు దొరక్కుండా హర్పాల్ ను సిటీ దాటించే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు ఏం జరుగుతుంది? అందుకు సమాధానంగా ఏ నిర్ణయాన్ని తీసుకోవడాన్ని పవన్ తన కర్తవ్యంగా భావిస్తాడు? అనేది కథ. జీవితంలో ప్రతి ఒక్కరూ ఎన్నో సమస్యలను .. పరీక్షలను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లవలసి ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే ఒక అయోమయానికి లోనవడం జరుగుతూ ఉంటుంది. తప్పు తన ఇంట్లో జరిగినప్పుడు .. సమాజంలో జరిగినప్పుడు తీసుకునే నిర్ణయాలు భిన్నంగా ఉంటాయి. కానీ తనవారైనా .. పరాయివారైనా తన కర్తవ్యాన్ని నిర్వహించడమే కరెక్ట్ అనుకునే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ఈ కథలో దర్శకుడు హీరో ముందు రెండు సమస్యలను ఉంచుతాడు. ప్రేమ పెళ్లిళ్లను వ్యతిరేకించే పెద్దల వర్గానికి ఎదురెళ్లడం. స్వామిజీ ముసుగులో ఆశ్రమం మాటున అక్రమ కార్యకలాపాలను నిర్వహించే వ్యక్తిని ఎదుర్కోవడం. ఒకే సమయంలో ఈ రెండు సమస్యలతో హీరో సతమతమైపోవడాన్ని చూపిస్తూ వెళ్లారు. రెండు వైపుల నుంచి సమస్యలను పతాకస్థాయికి తీసుకుని వెళుతూ, ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. దర్శకుడు ఈ కథలోని రెండు సమస్యలను లోతుగా ఆవిష్కరించే ప్రయత్నాలు చేయలేదు. కథ చివరిలో హీరో తన కర్తవ్య నిర్వహణను చేపడతాడు. అయితే అందుకు ఆయన ఎక్కువ సమయం తీసుకోలేదు. గన్ తీసి ఒక్కొక్కరినీ షూట్ చేస్తూ వెళతాడు. అయితే స్వామిజీ ట్రాక్ కి సంబంధించి అసలు తలకాయలు మాత్రం అలాగే ఉండటం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. మొదటి దగ్గర నుంచి క్లైమాక్స్ కి ముందువరకూ నిదానంగా నడిచిన కథ, ఆ తరువాత హడావిడిగా ముగిసిపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. రొటీన్ కథను రొటీన్ గానే చెప్పడం అసహనాన్ని కలిగిస్తుంది. ఆరిస్టుల నటన గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీలేదు. ఆ స్థాయి సన్నివేశాలు కూడా పడలేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. కథగా చూసుకుంటే ఇది కూడా ఒక పోలీస్ స్టోరీ అంతే. ఇంతకుముందు ఇలాంటి కథలు చాలానే వచ్చాయి. ఆ కథలకు భిన్నంగా వెళ్లడానికి ఎంతమాత్రం ప్రయత్నించని కంటెంట్ ఇది. చాలా తక్కువమంది ఆర్టిస్టులతో .. సింపుల్ బడ్జెట్ లోనే కానిచ్చేశారు. ఎమోషనన్స్ పరంగా .. యాక్షన్ పరంగా ఎక్కడా కనెక్ట్ కాని కథగానే ఇది మిగిలిపోతుంది.

# ప్రతి అనుభవం ఒక పాఠమే



స్త్రీ స్వేచ్ఛ అనే అంశంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది బాలీవుడ్ భామ కైరా అద్వానీ. ఈ నేపథ్యంలో ఏడాది కూడా నిండని తన కుమార్తె సరయు భవిష్యత్ గురించి మాట్లాడుతూ షాకింగ్ కామెంట్లు చేసింది. దీంతో ఆమెపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆ ఇంటర్వ్యూలో కైరా మాట్లాడుతూ 'స్త్రీకి స్వేచ్ఛ అవసరం. కట్టుబానిసగా బతకాల్సిన అవసరం స్త్రీకి లేదు. పెళ్లయినా, డేటింగ్ అయినా ఆమె ఇష్టంతో జరగాలి. నేను అలాగే బ్రతికాను. సరైన వ్యక్తిని ఎంచుకునే క్రమంలో చాలామందితో డేటింగ్ చేశాను. చివరకు సరైన వ్యక్తి దొరికాడు. ఎదిగే క్రమంలో ప్రతి అనుభవం ఒక పాఠమే. అవే మనల్ని మనిషిగా మారుస్తాయి. పొరపాట్లు మానవసహజం. వాటిని దిద్దుకుంటూ ముందుకు సాగడమే జీవితం. నా కూతురు సరయు విషయంలోనూ నేను ఇదే పంథా అనుసరిస్తా. నాలాగే తనూ జీవిస్తుంది. ఈ క్రమంలో తనకు ఎలాంటి ఆంక్షలూ విధించను' అంటూ చెప్పుకొచ్చింది కైరా. ఇక ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. కూతురు గురించి ఇలాగేనా మాట్లాడేది? ఇదేం ఫెమినిజం? అంటూ ప్రశ్నిస్తున్నారు. కియారా మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


# 'ఎగ్జామ్' సిరీస్ రివ్యూ!

ఒక వైపున హారర్ థ్రిల్లర్లు .. మరో వైపున క్రైమ్ థ్రిల్లర్లు ఓటీటీలను ఊపేస్తున్నాయి. ఇక అడపా దడపా పొలిటికల్ థ్రిల్లర్లు పలకరిస్తూ వెళుతున్నాయి. అయితే అందుకు భిన్నంగా ఒక సిరీస్ ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ కి వచ్చింది. ఆ సిరీస్ పేరే 'ఎగ్జామ్'. దుషారా విజయన్ – అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ లో అబ్బాస్ కీలకమైన పాత్రలో కనిపిస్తాడు. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. మరుమల్లి (అదితి బాలన్) డీఎస్పీ గా పనిచేస్తూ ఉంటుంది. తన కూతురుతో కలిసి తల్లి దగ్గర ఆమె ఉంటూ ఉంటుంది. 'తైకార' అనే ప్రదేశానికి ఆమెకి బదిలీ అవుతుంది. జాయినింగ్ రిపోర్ట్ ను సబ్మిట్ చేయడం కోసం ఆమె ఒంటరిగా బయల్దేరుతుంది. ఫారెస్టు ప్రాంతం మీదుగా వెళుతున్న ఆమెను, ఝాన్సీ (దుషారా విజయన్) కిడ్నాప్ చేస్తుంది. జయచంద్రన్ (అబ్బాస్) సూచన మేరకు, మరుమల్లిని ఒక రహస్య ప్రదేశంలో బంధిస్తుంది. మరుమల్లి పేరుతో తాను డీఎస్పీగా ఝాన్సీ డ్యూటీలో చేరుతుంది. తాను మరుమల్లిని కాదనే విషయం బయటికి తెలిసేలోగా తాను వచ్చిన పనిని పూర్తి చేయాలని నిర్ణయించుకుంటుంది. పోటీ పరీక్షలు .. ప్రశ్న పత్రాల లీక్ చేసే వ్యవహారాలు .. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే కోట్ల రూపాయల స్కామ్ వెనుక ఎవరున్నారనేది తెలుసుకోవడానికి ధైర్యంగా ముందుకు వెళుతుంది. ఆ సమయంలోనే ఆమెకి 'కుమరేశన్' పేరు వినిపిస్తుంది. కుమరేశన్ ఎవరు? అతని నేపథ్యం ఏమిటి? పోటీ పరీక్షలకి సంబంధించిన ప్రశ్న పత్రాలను లీక్ విషయంలో అతని పాత్ర ఏమిటి? ఈ మొత్తం వ్యవహారంతో మరుమల్లికి ఉన్న సంబంధం ఎలాంటిది? ఈ విషయంలో ఝాన్సీ ఎందుకు జోక్యం చేసుకుంటోంది? ఆమెను ఇంతటి సాహసానికి పురిగొల్పిన పరిస్థితులు ఎలాంటివి? ఆమెకి సాయం చేసే జయచంద్రన్ ఎవరు? అనే ఉత్కంఠభరితమైన మలుపులతో ఈ కథ ముందుకు వెళుతుంది. చాలామందికి ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక కల.



అలాంటి ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించుకోవడానికి వాళ్లంతా ఎంతో కష్టపడుతూ ఉంటారు. ఎలాంటి కోచింగ్ లేని పల్లెటూరి పిల్లలు .. ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమయ్యే పిల్లలు ఆ సమస్యలను దాటుకుంటూ పుస్తకాలపై దృష్టి పెట్టడం సామాన్యమైన విశేషమేం కాదు. అలాంటి పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఒక నెట్ వర్క్ చుట్టూ తిరిగే కథ ఇది. ఎంతోమంది తెలివైన పిల్లలు పల్లెటూళ్లకే పరిమితమైపోతున్నారు. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ కాలం కలిసి రాకపోవడం వలన, పేదరికంలో మగ్గిపోతున్నారు. చదువుకోవాలని ఉన్నప్పటికీ, కూలి పనులను దాటుకుని అడుగుముందుకు వేయలేకపోతున్నారు. కానీ ఎలాంటి ప్రతిభలేని కొంతమంది పిల్లలు అడ్డదారుల్లో మార్కులు సంపాదిస్తున్నారు .. సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారు .. ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి పేదరికాన్ని జయించి పట్టణంలో అడుగుపెట్టిన కుమరేశన్ .. ఝాన్సీలకు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? ఆ సవాళ్లను దాటుకుంటూ వాళ్లు ఎలా తమ మార్గంలో ముందుకు వెళతారు? అనే ప్రధానమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. దర్శకుడు నాణానికి ఇరువైపులా అన్నట్టుగా ఒక వైపున కుమరేశన్ ను .. మరో వైపున ఝాన్సీ పాత్రలను చూపిస్తూ కథను పట్టుగా నడిపించాడు. ఈ కథ మూడు కోణాల వైపు నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల సమాహారం ఒకటైతే, కుమరేశన్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ .. ఝాన్సీ ఫ్లాష్ బ్యాక్ రెండు వైపులా నుంచి కనెక్ట్ అవుతాయి. ఈ ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఎలా లీక్ అవుతున్నాయి? అవి డబ్బున్న పిల్లల చేతికి ఎలా చేరుతున్నాయి? నిజమైన ప్రతిభ కలిగిన పేద పిల్లలు ఎలా వెనుకబడి పోతున్నారు? సర్కారీ కొలువులు డబ్బున్నవారికి ఎలా అలంకారంగా మారుతున్నాయి? ఇదే పనిగా పెట్టుకున్న నెట్ వర్క్ ఎలా పనిచేస్తుంది? అనేది దర్శకుడు చూపించిన తీరు మెప్పిస్తుంది .. ఆలోచింపజేస్తుంది ఆందోళన కలిగిస్తుంది. 'ఎగ్జామ్' అనే టైటిల్ ఈ సిరీస్ కి కరెక్టుగా సరిపోతుంది. కాకపోతే పోటీ పరీక్షలు .. కోచింగ్ సెంటర్లు .. పేపర్ లీక్ కావడం .. అందుకు సంబంధించిన హడావిడి ఎక్కువగా ఉంటుందని అనుకోవడం సహజం.

# ఒంటరి తోడేలు కథ



హీరో రామ్ పోతినేని తొలిసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. ఇప్పటికే నటనతో పాటు గాయకుడిగా, గీత రచయితగా సత్తాచాటిన ఆయన దర్శకుడిగా ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. తన 23వ సినిమాతో రామ్ పోతినేని దర్శకుడిగా సరికొత్త ప్రయాణాన్ని మొదలుపెడుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించే ఈ సినిమా సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. శుక్రవారం రామ్ పోతినేని జన్మదినం సందర్భంగా స్పెషల్ బర్త్‌డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన 'వీర' పాత్రలో కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వూల్ఫ్' అనే క్యాప్షన్ ఆయన పాత్ర తాలూకు ఇంటెన్సిటీని ప్రతిబింబిస్తున్నది. మానసిక సంఘర్షణతో కూడిన ఈ పాత్రలో రామ్ అగ్రెసివ్ యాటిట్యూడ్ కలిగిన వ్యక్తిగా కనిపిస్తాడని, ఆయన మేకోవర్ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి డిసెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడించనున్నారు.

## స్థానికంగా ఉండి సమన్వయంతో పని చేద్దాం
## గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం సర్పంచ్ మోహన్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం గ్రామంలో గ్రామ సర్పంచ్ యోహన్ ఉప సర్పంచ్ వీరేశం గ్రామ కార్యదర్శి వార్డు మెంబర్ల సమీక్ష సమావేశం శనివారం నాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు గ్రామ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని తీర్మానం చేశారు ఇటీవల జరిగిన కొన్ని సమావేశాల్లో లేనిపోని సత్యదూరం వార్తలు రాయడం పట్ల విచారం వ్యక్తం చేశారు కొన్ని సమావేశాలు నిర్వహించేటప్పుడు సమస్య త్వరగా పరిష్కారం అయ్యేందుకు అయ్యేందుకు డోర్స్ క్లోజ్ చేసుకుని చేయాల్సిన అవసరం ఉంటుంది దీనిని తప్పుగా భావించిన కొందరు గ్రామస్తులు పత్రికా ఎలక్ట్రాన్ మీడియా వారికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు దయచేసి వాస్తవాలు రాయండి మా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి మీ వంతు సహకారం అందించండి పత్రిక రంగానికి మేము ఎప్పుడు రుణపడి ఉంటాము అని సర్పంచ్ మోహన్ తెలిపారు.

## రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని ఐకెపి (ఇందిరా క్రాంతి పథం)ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిఎం మార్కెటింగ్ అధికారి ,ఆర్డీవో, డి ఎం సి ఎస్, డీఎస్ఓ తాసిల్దార్ ఎంపీడీవో కలిసి కలెక్టర్ పరిశీలించారు. టోకెన్ విధానం అమలులో ఉందా? అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. కేంద్రాల్లో , గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా?అని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఇప్పటి వరకు 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 533 కేంద్రాల్లో, 519 కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కోసం పనిచేస్తున్నాయన్నారు.టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు.అలాగే రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులను ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అక్కడ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను, రవాణా వివరాలను పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ రజని, ఎంపీడీవో, సంబంధిత కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో
## నూతన అధికారుల బాధ్యతలు స్వీకరణ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహమ్మద్ ఫయాజ్ (ఇల్లంతకుంట హై స్కూల్ నుండి) సీనియర్ సహాయకులుగా ప్రమోషన్‌పై విధుల్లో శనివారం చేరారు.అలాగే కుమారి రెడ్డి రాజుల భవాణి,హౌసింగ్ ఏఈ గా జగిత్యాల జిల్లా,ధర్మపురి మండలం నుండి బదిలీపై బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ భీమా జయశీల,కార్యాలయ సిబ్బంది వారిని అభినందిస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## "ఖర్మ రిటర్న్స్" కేంద్ర మంత్రి బండికి త్వరగానే తెలిసింది

**- వ్యక్తిగత వ్యాఖ్యలు రాజకీయాలకు మంచిది కాదు**

**- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై స్పందించిన అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యుల పుట్టుకలు, వ్యక్తిగత జీవితాలపై వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ అన్నారు.ఇటీవల సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న రాజకీయ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, రాజకీయ నాయకులు హద్దులు దాటి మాట్లాడటం వల్ల సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పేర్కొన్నారు. ఇతరుల కుటుంబాలపై, పుట్టుకలపై విమర్శలు చేసిన వారు ఇప్పుడు తమ కుటుంబ విషయాలపైనే వివరణలు ఇవ్వాల్సిన పరిస్థితి రావడం "కర్మ రిటర్న్స్" అనే సిద్ధాంతాన్ని గుర్తు చేస్తోందని వ్యాఖ్యానించారు.రాజకీయాల్లో సిద్ధాంతాలపై విమర్శలు చేయాలి గానీ, వ్యక్తిగత జీవితాలను లాగడం తగదని అన్నారు. ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పరస్పర గౌరవం పాటించాలని సూచించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అంశాలపై ప్రజలు కూడా ఆలోచనాత్మకంగా స్పందించాలని కోరారు.

# పెట్రోల్ ధరలు పెంపు పై భగ్గుమన్న వామపక్షాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్ డీజిల్ ధరలను ఏకంగా మూడు రూపాయలు చొప్పున కేంద్రం పెంచేసింది. సామాన్యుడు పై ఈ భారం మోయలేనిదని, అదిగాక చమురు ధరలు పెరుగుతే నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయి.దీనికి నిరసనగా వామపక్ష పార్టీలు (సిపిఐ, సిపిఎం) తీవ్ర ఆందోళన చేపడుతూ కేంద్రానికి నిరసనగా ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. అలాగే యుద్ధప్రాతిపదికన ఈ నిర్ణయాలు వెనిక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరసనలు..**

చమురు ధరలు పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. హైద్రారబాద్ మహానగరంలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు రోడ్ల పైకి వచ్చి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

**సెంట్రల్ గవర్నమెంట్ పై విమర్శలు..**

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ముడి ధరల పెరుగుదలకు



యుద్ధ పరిస్థితులను బూచిగా చూపడం సరికాదని లెఫ్ట్ పార్టీలు మండిపడ్డాయి.అదిగాక అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు గడించిన చమురు కంపెనీలు.ఇప్పుడు పెరిగిన ధరలు ప్రజలపై మోపడం సరైన విధానం కాదన్నారు.

**పెరిగిన పెట్రోల్ డీజిల్ తో బతుకుడు కష్టమే..**

దేశంలో ఉన్న మెట్రో పాలిటిన్ సిటిలో ఇప్పటికే లీటర్ పెట్రోల్ డీజిల్ పై:3 రూపాయల పైచిలుకు పెరగడంతో మధ్య తరగతి,కార్మిక వర్గాల జీవితం ఇబ్బందులకు గురవుతారు. అలాగే ఇంధనం ధరలు పెంపుతో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని లెఫ్ట్ పార్టీలు హెచ్చరించారు.

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు..**

అదాని,అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు లబ్ది చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం డీజిల్,పెట్రోల్ ధరలను పెంచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఆరోపించారు.ఎన్నికల ముందు ధరలు



పెంచమని చెప్పి, ఇప్పుడు ఎన్నికల తరువాత ధరలు పెంచిన నరేంద్రమోదీ ప్రభుత్వం మోసకారి సర్కార్ గా మారిందని విమర్శించారు. పెంచిన పెట్రోల్,డీజిల్,వంట సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కూనంనేని పాల్గొన్నారు.హిమాయత్ నగర్ ఏఐటీయూసీ భవన్ నుండి వై జంక్షన్ వరకు ఆటోకు తాడుకట్టి లాగుతూ కూనంనేని నిరసనను తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ధరల పెరుగుదల కారణంగా ప్రజలపై పెను భారం పడుతుందన్నారు.ప్రధాని మోదీ ఖర్చులు తగ్గించుకోవాలని,ఆర్థిక సంక్షోభం వస్తుందని మాట్లాడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. గతంలో సంక్షోభంలో ఉన్నప్పుడు మాజీ ప్రధానిలు పీవీ నరసింహారావు , మన్మోహన్ సింగ్ లు సమర్థవంతంగా పాలనను అందించి ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారు వేసిన పునదులపై పాలన అందిస్తున్న మోదీ ప్రభుత్వం ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు.పెంచిన ధరలను తగ్గించేంత వరకు సిపిఐ ఆందోళనలను కొనసాగిస్తుందని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

**సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నం చేయకపోగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేయడం ఎంతవరకు సమంజసం అని సిపిఎం పోలిట్




బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో సిపిఎం పోలీస్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు,సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరయ్యారు.ఈ సందర్భంగా బివి రాఘవులు మాట్లాడుతూ పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాలను నిలిపివేయడానికి ప్రయత్నం చేయకపోగా ఆయా దేశాలకు వెళ్లి యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆరోపించారు.నేడు పొదుపు చర్యలు గుర్తుకు వచ్చాయా యుద్ధ సమయంలో పాటించని పొదుపు చర్యలు ఇప్పుడెందుకు పాటించాలని ప్రజలకు సూచనలు ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.పెట్రోల్ డీజిల్ ఎరువులు పొదుపుగా వాడాలని కొత్త పద్ధతులు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవన్నీ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ఏమవుతుందని ఆయన నిలదీశారు.ఇవన్నీ ఆపడం వల్ల ఉత్పత్తి నిలిచిపోయి ఆర్థిక వ్యవస్థ పతనమై ఉపాధి దెబ్బతింటుందని అన్నారు. ఉత్పత్తికి ఆటంకం అయ్యే సలహాలు దేశ ప్రధాని ఇస్తున్నారని దీనికంటే ముందు యుద్ధాన్ని ఆపడానికి ప్రధాని చొరవ చూపాలని ఆయన హితవు పలికారు.అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి కుంటుపడుతుందని అన్నారు.సిపిఎం పార్టీ దేశవ్యాప్తంగా యిచ్చిన పిలుపుమేరకు హైదరాబాద్లో పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.దేశ ప్రధాని మోదీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ను పొదుపుగా వాడుకోవాలని,బంగారం కొనవద్దని,చెబుతున్నాడని చివరకు పేద ప్రజలు అన్నం కూడా తినవద్దని సలహాలు ఇచ్చే స్థితికి దేశాన్ని తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు.

# గజ్వేల్‌లో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి 2 రోజుల జైలు శిక్ష**

**19 మందికి రూ.1.72 లక్షల జరిమానా - లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన 12 మందికి రూ.60 వేల ఫైన్**

గజ్వేల్(ప్రశ్న న్యూస్)గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై కఠిన చర్యలు తీసుకున్నారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ డి. సత్యనారాయణ ఆధ్వర్యంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్‌పల్లి రోడ్, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 19 మంది పట్టుబడ్డారు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి స్వాతి గౌడ్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు మొత్తం రూ.1,72,000 జరిమానా విధించడంతో పాటు ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది.అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 12 మందికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.60 వేల జరిమానా విధించారు. మొత్తం జరిమానా రూ.2,32,000గా నమోదైంది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డి. సత్యనారాయణ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ పోలీసుల సూచనలు**

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి
కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలి
ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు నియమాలను పాటించాలి
అధిక వేగంతో వాహనాలు నడపరాదు
మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి
"మన భద్రత – మన చేతుల్లోనే" అనే భావనతో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.




## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

**తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**



ఇబ్రహీంపట్నం( ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పై రూ. 3 రూపాయలు పెంచడం అత్యంత దారుణమని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ 16వ వార్డు తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో తిరిగి ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ పై లీటరుకు మూడు రూపాయలు అదనంగా పెంచి, కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరిచిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్న రాబోయే రోజుల్లో దేశంలో పెట్రోల్, డీజల్ ధరలు ఏమాత్రం పెంచబోమని ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాన నరేంద్రమోడీ మాట ఇచ్చారని, మరి ఇప్పుడు ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పి ఎన్నికల ముగిసి మూడు వారాలైనా కాకనే ఒక్కసారిగా పెట్రోల్ డీజిల్ పై అధిక ధరలు పెంచి దేశ ప్రజలను మోసగించడం తగదన్నారు. పెట్రోల్, డీజిల్ పెరగటం వల్ల నిత్యవసర సరుకులు కూడా పెరిగే అవకాశం ఉందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం వల్ల సామాన్య ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

## అనంతపల్లిలో వడ్ల తరలింపు జాప్యంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

**- కొనుగోలు కేంద్రంలో మౌళిక సౌకర్యాలు కల్పించాలి**

**- బస్తాకు రూ.3 వసూలు చేయడం దారుణం**

**- ఎమ్మార్పీఎస్ మండల కో- కన్వీనర్ : మల్లారపు చందు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ బోయినిపల్లి మండల కో–కన్వీనర్ మల్లారపు చందు ఆరోపించారు. రైతులు వడ్లు కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. బస్తాకు రూ.3 చొప్పున వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కేంద్రంలో తాగునీటి వంటి కనీస మౌళిక సౌకర్యాలు లేక రైతులు ఎండలో అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోజుకు ఒకటి లేదా రెండు లారీలు మాత్రమే రావడంతో వడ్ల తరలింపు ఆలస్యమవుతోందని, రోజుకు కనీసం 2–3 లారీలు ఏర్పాటు చేసి వెంటనే వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

# ఎన్టీఆర్ ఘాట్ ఫుట్‌పాత్‌లపై కబ్జా

- వ్యాపారుల అడ్డాగా మారిన, సెక్రటేరియట్, హుస్సేన్ సాగర్ పరిసరాలు
- ట్రాఫిక్ పోలీసుల, హెచ్‌ఎండిఏ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు నరకం
- కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన ఫుట్ పాత్ వ్యాపారులు
- హెచ్ఎండిఏ ట్రాఫిక్ పోలీసుల పూర్తి బాధ్యతారాహిత్యం
- హుస్సేన్ సాగర్ పరిసరాల అభివృద్ధి కోసం కోట్లు ఖర్చు గాలికేనా
- ఫుట్ పాత్ వ్యాపారులతో రహదారులు చెత్తమయం
- ట్రాఫిక్ పోలీసులు డ్యూటీ చేయడం మానేశారా.? ఉన్నత అధికారులు పర్యవేక్షణ పక్కన పెట్టారా.?





**అధికారులు డ్యూటీ చేస్తున్నారా, లేక చూస్తూ ఊరుకుంటున్నారా.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హుస్సేన్ సాగర్ ఎన్టీఆర్ గాట్ పరిసర ప్రాంతాలు, ముఖ్యంగా ఎన్టీఆర్ ఘాట్, లుంబిని పార్క్ సమీపం, ప్రతి రోజు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పూర్తిగా ఫుట్ పాత్ వ్యాపారులతో రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఫుట్‌పాత్‌లను పూర్తిస్థాయిలో ఆక్రమించి వ్యాపారులు యథేచ్ఛగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో రోడ్లు కిక్కిరిసి ట్రాఫిక్ జామ్‌లకు కేంద్రంగా మారాయి. కుటుంబాలతో విహారానికి వచ్చే ప్రజలు నడవడానికి కూడా స్థలం లేక రోడ్లపై నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు అందంగా కనిపించిన హుస్సేన్ సాగర్ పరిసరాలు ఇప్పుడు చెత్త, ట్రాఫిక్, హోరాహోరీ వ్యాపారాల మధ్య నలిగిపోతున్నాయి.

## ఫుట్‌పాత్‌లు ప్రజల కోసంనా, వ్యాపారుల కోసంనా.?

హైదరాబాద్ లో ఫుట్ పాత్ లు వ్యాపారుల కోసమా.? పాదాచారుల కోసమా.? అర్థం కాని పరిస్థితి నెలకొన్నది.

ప్రతి రోజు సాయంత్రం దాదాపు 5 గంటల తర్వాత నుంచి రాత్రి 1 గంట వరకు రోడ్డు పక్కనే ఐస్ క్రీమ్ బండ్లు, టిఫిన్ సెంటర్లు, చాట్ స్టాల్స్, టీ దుకాణాలు వరుసగా నిలబెడుతున్నారు. ఫుట్‌పాత్ మొత్తం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో ప్రజలు రోడ్డు మీదే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వీకెండ్లలో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతోంది. అయిన అక్కడ ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు కనిపించరని, అసలు ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారా.? అన్న సందేహం కలుగుతుంది, మరి ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తే ఫుట్ పాత్ లపై వందల సంఖ్యలో వ్యాపారులు ఎలా కబ్జా చేశారని ప్రజలు మండిపడుతున్నారు.

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల వ్యవహారంపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. రోజూ అదే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు ఉధృతంగా ఉన్నా పోలీసులు మాత్రం కనిపించరని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఫుట్ పాత్ లా కబ్జాతో వందలాది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయినా,

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చాలా పెరిగినా ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా హెచ్ఎండిఏ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాన్ని హెచ్ఎండిఏ అధికారులు లేక సిబ్బంది ఫుట్ పాత్ వ్యాపారల వద్ద లంచాలు తీసుకొని మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## ట్రాఫిక్ పోలీసులు డ్యూటీ చేస్తున్నారా.?

సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వచ్చే సెక్రటేరియట్, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల వద్ద నిజంగా ట్రాఫిక్ పోలీసులు డ్యూటీ చేస్తున్నారా.? లేక కేవలం పేరుకే పోస్టింగులా.? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లోనే పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే ఇక నగరంలో పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉంటుందో నగర కమిషనర్ కు డిజిపికే తెలియాలని ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు మధ్యలో బండ్లు నిలబెట్టి వ్యాపారం జరుగుతున్నా పోలీసులు అసలు పట్టించుకోవడం లేదని దాని వెనక వాళ్ళతో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రతి నెల మామూళ్లు అందుతున్నాయా.?

హెచ్ఎండిఏ అధికారులపై, ట్రాఫిక్ పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీ స్థాయిలో ఆక్రమణలు జరుగుతున్నా చర్యలు లేకపోవడంతో "ప్రతి నెల వాటాలు అందుతున్నాయా.?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరి వాటిని పూర్తిస్థాయిలో చేదించవలసిన స్పెషల్ బ్రాంచ్ (ఎస్ బి) పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తవిస్తోంది. కోట్ల రూపాయల ప్రజా ధనంతో అభివృద్ధి చేసిన ప్రాంతాలను ఇలా నిర్లక్ష్యానికి వదిలేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.

## చెత్తకుప్పలుగా మారుతున్న హుస్సేన్ సాగర్ ప్రాంతాలు..

హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు ప్రస్తుతం చెత్తతో నిండిపోతున్నాయి. వ్యాపారులు వాడిన ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఆహార వ్యర్థాలు రోడ్ల పక్కనే పడేస్తుండడంతో ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో మద్యం సేవించి హంగామా చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని కొంతమంది ఆక్రమణదారులు, నిర్లక్ష్య అధికారులు కలిసి చెత్తకుప్పగా మార్చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## డిజిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తులు

సెక్రటేరియట్, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలలో ఫుట్‌పాత్ ఆక్రమణలను పూర్తిగా తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని, అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 1 వరకు ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి హుస్సేన్ సాగర్ ప్రాంతాన్ని మళ్లీ శుభ్రంగా, సురక్షితంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసు, హెచ్ఎండిఏ ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# హైదరాబాద్ లో భూముల విలువను పెంచబోతున్నాం

**- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్‌డేట్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భూముల మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ ధరల) పెంపుదలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే శాస్త్రీయ పద్ధతిలో భూముల మార్కెట్ విలువను సవరించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలను ప్రామాణికంగా తీసుకుని ఈ ధరల పెంపు ఉంటుందని వివరించారు. ఈ శాస్త్రీయ సవరణల వల్ల కొన్ని ప్రాంతాలలో మార్కెట్ విలువ కనీసం రూ. 15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గతంలో రెండు సార్లు భూముల విలువను పెంచిందని మంత్రి గుర్తుచేశారు. అయితే, చివరిగా 2022 ఫిబ్రవరిలో భూముల మార్కెట్ విలువను సవరించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# రాయల్ ఎన్ ఫీల్డ్ బండెక్కిన చంద్రబాబు

**- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ ఆశ్చర్యపరిచారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో భాగంగా ఆయన హెల్మెట్ ధరించి, రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 650 బైక్‌పై ఎక్కారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీసులను అభినందించారు. అనంతరం స్వయంగా హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై కూర్చుని యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర అధికారులు ఉన్నారు. అంతకుముందు, ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని 'స్వర ఆర్ట్ గ్యాలరీ' స్టాల్‌లో గిరిజనులు రూపొందించిన ఓవర్‌కోట్‌ను కొనుగోలు చేసి అక్కడే ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి ఇలా బైక్‌పై కనిపించడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించగా, ఈ వీడియోపై నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు.

# వినియోగంలో లేని డంపింగ్ యార్డులు, ప్రజాధనం బుగ్గిపాలు

- రోడ్లపైనే చెత్త కుప్పలు కాగితాలకే పరిమితమైన చెత్త విభజన
- ప్రభుత్వ భూమి.. 'డస్ట్ బిన్'గా మార్పు - పురపాలక శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం
- ఎల్లంపేట పురపాలక శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న శ్రీరంగవరం, బండ మాదారం ప్రజలు







మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి, చెత్త నుండి ఆదాయం సృష్టించాలి అనే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన 'డంపింగ్ యార్డ్'ల నిర్వహణ ప్రస్తుతం అభాసుపాలవుతోంది. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని శ్రీరంగవరం, బండ మాదారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు అధికారుల ఉదాసీనతకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి రంగురంగుల చిత్రాలతో ముస్తాబు చేసిన ఈ షెడ్లు నేడు కేవలం అలంకారప్రాయంగా మారిపోయాయి.

## కాగితాలకే పరిమితమైన చెత్త విభజన..

నిబంధనల ప్రకారం.. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలి. వాటిని డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ నిర్మించిన ప్రత్యేక అరలలో వేసి బయో మైనింగ్ పద్ధతిలో సేంద్రియ ఎరువును తయారు చేయాలి. కానీ, ఇక్కడ పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఫోటోలను గమనిస్తే, చెత్తను వేరు చేయడానికి నిర్మించిన అరలు ఖాళీగా, వెలవెలబోతూ కనిపిస్తున్నాయి. గ్లాసు ముక్కలు, ప్లాస్టిక్, కాగితం వంటి వాటిని విడివిడిగా భద్రపరచాల్సిన చోట కనీసం ఒక్క చెత్త బుట్ట కూడా కనిపించకపోవడం గమనార్హం.

## పభుత్వ భూమి.. 'డస్ట్ బిన్'గా మార్పు..

డంపింగ్ యార్డులను వినియోగించకుండా, అధికారులు సులువు మార్గాన్ని ఎంచుకున్నారు. గ్రామాల్లో సేకరించిన టన్నుల కొద్దీ చెత్తను సర్వే నంబర్ 428లోని ప్రభుత్వ ఖాళీ భూముల్లో పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ఒక భారీ చెత్త కొండగా మారిపోయింది. లక్షలు ఖర్చు పెట్టి షెడ్లు కట్టినప్పుడు అందులో వేయకుండా, గాలికి వదిలేయడం ఏంటి ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పురపాలక శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం..

ఆరేళ్ల క్రితమే ఈ వ్యవస్థలు ప్రారంభమైనా, నేటికీ పూర్తిస్థాయిలో అమలులోకి రాకపోవడం వెనుక వార్డు అధికారులు, పురపాలక శాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. వార్డు అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని గ్రామస్థులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పకటికైనా ఎల్లంపేట పురపాలక కమిషనర్ వెంటనే స్పందించి, బహిరంగంగా చెత్త వేయడాన్ని నిలిపివేయాలని, పాత చెత్తను బయో మైనింగ్ ద్వారా తొలగించి, నిర్మించిన డంపింగ్ యార్డులను యుద్ధ ప్రాతిపదికన వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అధికారుల అత్యుత్సాహం - భక్తులపాలిట శాపం

- బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో అధికారుల ఇష్టారాజ్యం
- సోషల్ మీడియాలో అమ్మ అలంకార ఫోటోలపై ఈ ఓ అంక్షలు
- దేవాలయ వెబ్ సైట్ లో అమ్మ అలంకార ఫోటోలు అందుబాటులో ఉంచడంలేదు
- ఈఓ వ్యవహార శైలితో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి
- ఎల్లమ్మ తల్లి అలంకార ఫోటోలపై ఈ.ఓ ఆంక్షలతో దేశ విదేశాల్లో ఉన్న భక్తులకు తీవ్ర అసౌకర్యం
- ఆలయంలో జరుగుతున్న అవకతవకలు, అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని భక్తుల డిమాండ్.





అమీర్ పేట్ (ప్రశ్న న్యూస్) ఏడు వందల సంవత్సరాల క్రితం స్వయంభూగా వెలిసిన ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో అక్రమాలు, అవినీతి ఆరోపణలు రోజురోజుకు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. ఆలయ సిబ్బంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం గ్రూపులు విడిపోవడంతో ఆలయ ప్రతిష్ట దెబ్బతింటుందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విశిష్టత సంతరించుకున్న ఈ ఆలయంలో గత కొంత కాలంగా కొనసాగుతున్న అక్రమాలు, ఆరోపణలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తూతూ మంత్రంగానే మారడంతో ఆలయంలో భక్తుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. అమ్మవారికి సమర్పించే విలువైన వస్తువులు, వస్త్రాలు, మూడో కంటికి తెలియకుండా అదృశ్యమవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆలయ సిబ్బందిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ ఆకస్మిక తనిఖీ చేసినను క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని భక్తులు గగ్గోలుపెడుతున్నారు.

## అమ్మవారి అలంకారం ఫోటోలపై రగడ..

భక్తులపాలిట కొంగుబంగారం, అత్యంత మహిమాన్వితమైన బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి అంటే భక్తులకు తరతరాలుగా వస్తున్న నమ్మకం. అయితే గత కొన్ని రోజులుగా ఆలయంలో జరుగుతున్న పలు సంఘటనలు భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి. ప్రతనిత్యం ఆలయంలో జరిగే అమ్మవారి విశిష్ట అలంకార ఫోటోలను దేవస్థానం వెబ్ సైట్లో అందుబాటులో ఉంచేవారు. ఇది ప్రత్యక్షంగా అమ్మను దర్శించుకోలేని వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. కాని ఆలయ అధికారుల ఇష్టారాజ్య వైఖరి మూలంగా గత కొంత కాలంగా అమ్మవారి అలంకార ఫోటోలను వెబ్ సైట్లో అందుబాటులో ఉంచకపోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో దేశ విదేశాలలో ఉన్న ఎల్లమ్మ తల్లి భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. అలాగే అమ్మవారి అలంకారణ ఫోటోలను సోషల్ మీడియాలో స్టేటస్ పెట్టవద్దని ఆలయ అధికారులు అంక్షలు పెట్టడం సనాతన ధర్మంపై చేస్తున్న దాడికి నిదర్శనమని పలువురు భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఆలయ అధికారుల అత్యుత్సాహంతో లక్షలాదిగా ఎల్లమ్మ తల్లి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. అలాగే జగజ్జనని జననీమాత అయిన ఎల్లమ్మ తల్లితో ఆటలాడుతు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తు, అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన ఆలయ అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన ఆలయ పవిత్రతను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588